ప్రజాశక్తి

శుక్రవారం 15 ఆగస్టు 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

◆ విశాఖలో రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్, అనకాపల్లిలో అనిత పతాకావిష్కరణ

◆ ముస్తాబైన శకటాలు



విశాఖలో పోలీస్ పరేడ్ మైదానంలో సిద్ధమైన వేదిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, అనకాపల్లి

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శుక్రవారం నిర్వహించనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. విశాఖ పోలీస్ పరేడ్ మైదానంలో ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అందుకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఉద్దేశాలను, లక్ష్యాలను, సాధించిన ఫలితాలను తెలియజేసే విధంగా ఎనిమిది విభాగాల ఆధ్వర్యంలో స్టాళ్లు, ఏడు విభాగాల ఆధ్వర్యంలో శకటాలను ప్రదర్శించేందుకు చర్యలు తీసుకున్నారు. జెండా వందనం జరిగే మైదానంలో పైలట్ వాహనానికి ట్రయిల్ రన్ నిర్వహించి సిద్ధం చేశారు. గౌరవ వందనం సమర్పించేందుకు, పరేడ్ నిర్వహించేందుకు వీలుగా వివిధ రక్షణ బృందాల నుంచి మొత్తం 52 మందికి శిక్షణ అందజేశారు. ఎనిమిది పాఠశాలల విద్యార్థులు దేశభక్తిని చాటుతూ నృత్యాలు చేసేందుకు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. పరేడ్ నిర్వహణకు, ఇతర కార్యకాలపాలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా మైదానంలో రోలింగ్ చేశారు. పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. సాధారణ పౌరులు, అతిథులు ఆశీనులయ్యేందుకు వీలుగా సోఫాలు, కుర్చీలు ఏర్పాటు చేశారు. బ్యారెక్స్ ప్రాంగణంలోని గోడలకు, మెట్లకు జాతీయ జెండా నమూనాలతో కూడిన రంగులు వేశారు. ప్రధాన వేదికను పూలతో సుందరంగా అలంకరించారు. శాంతికి చిహ్నంగా బెలూన్లను సిద్ధం చేశారు. ప్రధాన వేదికకు రెండు వైపులా అతిథులు ఆశీనులయ్యేందుకుగాను సోఫాలు, కుర్చీలు ఏర్పాటు మిగతా 2లో..

అప్రమత్తంగా ఉండండి

◆ ఏ క్షణమైనా భారీ వర్షాలు

◆ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు

◆ ఎప్పటికప్పుడు వాతావరణంపై అధికారుల సమీక్షలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ, అనకాపల్లి విలేకరులు

భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు, అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లాలోని అధికారులతో గురువారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు, క్షేత్ర స్థాయిలో విఆర్ఒలు, పంచాయతీ కార్యదర్శులు హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలన్నారు. ఉద్యోగులకు ఎలాంటి సెలవులూ మంజూరు చేయబడవని తెలిపారు. జోనల్ ఆఫీసులలో, ఆర్‌డిఒ, తహశీల్దార్ కార్యాలయాలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని, వేటకు వెళ్లి ఉంటే వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించారు. అన్ని మ్యాన్ హోల్స్‌పై మూతలు ఉండే విధంగా చూడాలన్నారు. డ్రెయినేజీలు పూడిపోకుండా పారిశుధ్య కార్మికులు మిగతా 2లో..




కోతకు గురైన విశాఖ తీరం

ఆర్‌కె బీచ్‌లో విషాదం

▶ వార్త మెయిన్‌లో..

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

▶ వార్త 2లో..



ఎసిబి వలలో ఎస్ఐ ఈశ్వరరావు



ఎస్ఐ ఈశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : లంచం తీసుకుంటుండగా అనకాపల్లి టౌన్ ఎస్ఐ దాసరి ఈశ్వరరావును రెడ్ హ్యాండెడ్‌గా అధికారులు పట్టుకున్నారు. ఈ విషయాన్ని మీడియాకు ఎసిబి డిఎస్‌పి నాగేశ్వరరావు గురువారం వెల్లడించారు. అనకాపల్లి రఘురాం కాలనీలో ఎస్ఐ నివాసం ఉంటున్న ఇంట్లోనే ఎసిబి అధికారులు అతన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పెందుర్తికి చెందిన బంగారు వ్యాపారి ఎస్ఆర్‌జె.అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిఘా వేసి పట్టుకున్నట్లు చెప్పారు. ఫిర్యాదుదారుడు అనకాపల్లిలో ఖాళీగా ఉన్న తన దుకాణాన్ని ఈ ఏడాది మేలో శ్రీ శాస్త్రి మండల్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చి, రూ.2 లక్షలను అడ్వాన్స్ తీసుకొని దుకాణం తాళాలను అతనికి అప్పగించాడు. జూలై 16న అద్దె దుకాణం నుంచి పక్కనే ఉన్న తన బంగారు దుకాణంలోకి అప్పారావు రంధ్రం తవ్వి బంగారు ఆభరణాలను దొంగిలించడానికి ప్రయత్నించాడని బుద్ధ శ్రీనివాసరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. దొంగతనానికి ప్రయత్నించడంలో అతని ప్రమేయం ఉందని నిర్ధారించుకోవడానికి అతనిని ఎస్ఐ విస్తృతంగా విచారించసాగాడు. అతని దుకాణానికి తాళం వేసి తన వద్దనే ఉంచుకున్నాడు. రూ.2 లక్షల అడ్వాన్స్ మొత్తాన్ని కూడా తీసుకున్నాడు. తరచుగా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, చాలా గంటలు వేచి ఉండాలని బలవంతం చేశాడు. తర్వాత బంధువు, ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది ద్వారా సంప్రదించగా మొదట రూ.లక్ష లంచం డిమాండ్ చేసి తరువాత దానిని రూ.50 వేలుకు తగ్గించాడు. దొంగతనం కేసులో ఇరికించకుండా షాపు తెరిచేందుకు అనుమతి ఇచ్చేందుకు ఈ లంచం డిమాండ్ చేశాడు.

బాధితుని నుంచి ఆ లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించాడు. అతనిపై శాఖాపరమైన చర్యలకు నివేదిస్తామని ఎసిబి డిఎస్‌పి తెలిపారు.

నేడు మద్దిలపాలెం డిపోలో 'స్త్రీ శక్తి' ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేసేందుకు ఉద్దేశించిన స్త్రీ శక్తి పథకం ప్రారంభ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 4 గంటలకు మద్దిలపాలెం డిపో వద్ద జరుగనుంది. ఈ మేరకు ఎపిఎస్ ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ బి.అప్పల నాయుడు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు.



కృష్ణాపురంలో బలవంతపు భూసేకరణ వద్దు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, గంగారావు

కలెక్టర్‌కు మొర పెట్టుకున్న రైతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామ రెవెన్యూలో తమ భూములను తమ అనుమతి లేకుండా ఎంఎస్ఎంఇ పార్కు కోసం చట్ట విరుద్ధంగా తీసుకుంటున్న చర్యలను విరమించి తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధిత రైతులు గురువారం సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు నాయకత్వంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమకు కృష్ణాపురం గ్రామ రెవెన్యూలో సర్వే నెంబరు 88, 93లో వ్యవసాయ భూములు ఉన్నాయని, అవి గత 50 ఏళ్లగా తమ స్వాధీనంలోనే ఉన్నాయని తెలిపారు. ఆ భూముల్లో టేకు, నీలగిరి, జీడిచెట్లు పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. తామంతా దళితులం, బలహీన వర్గాలకు చెందినవారమని, పేద రైతులమని పేర్కొన్నారు. మొత్తం 60 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నామని, ఆ భూముల్లో 11 మందికి 11 ఎకరాల భూమి అసైన్డ్ హక్కులు కూడా కల్పించారని తెలిపారు. మొత్తం 66 ఎకరాలను ఎంఎస్ఎంఇ పార్కుకు కేటాయించినట్లు తెలిసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికొక ఎంఎస్ఎంఇ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, దీనిలో భాగంగా తమ కృష్ణాపురం గ్రామంలో తమ భూముల్లో ఈ పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసిందని పేర్కొన్నారు. తమకు తెలియపర్చకుండా తమ భూముల్లో వున్నటువంటి టేకు, నీలగిరి, జీడి చెట్లను ప్రొక్లెయిన్లు, జెసిబిలు తీసుకొచ్చి ఎందుకు తొలగిస్తున్నారని ఇటీవల అడ్డుకున్నామన్నారు. తాత్కాలికంగా వెనక్కి వెళ్లారన్నారు.

తమ తాత, తండ్రుల నుండి ఈ భూములే ఆధారంగా జీవనం సాగిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎంఎస్ఎంఇ పార్కుకు అవసరమైన భూసేకరణకు గ్రామ తీర్మానం చేయలేదని, ప్రజాభిప్రాయ సేకరణ జరపలేదని తెలిపారు. తమ భూములుపై సర్వే కూడా చేయలేదని చెప్పారు. అన్ని చట్టాలనూ ఉల్లంఘించి భూములను దౌర్జన్యంగా తీసుకోవటానికి ప్రయత్నం చేయటం చట్ట వ్యతిరేకమన్నారు. ఒకవేళ ఎంఎస్ఎంఇ పార్కుకు భూములు అవసరమైతే తమ ఆమోదంతో భూసేకరణ చట్టం-2013 ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రైతులు గాడు అప్పలనాయుడు, ఎన్.వెంకటరావు, ఎన్.రాంబాబు, ఎం.పైడినాయుడు, చిన్నా ఉన్నారు

మొదటి పేజీ తరువాయి..

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

చేశారు. కుండీలతో మొక్కలు ఏర్పాటు చేసి వేదికను సుందరంగా తీర్చిదిద్దారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను తెలియజేస్తూ పలు శాఖలు స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేశాయి. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర ఉద్దేశాలను తెలుపుతూ జివిఎంసి, భవిష్యత్తు విశాఖ కోసం సుస్థిరమైన మౌలిక వసతుల అభివృద్ధి అనే థీమ్‌తో విఎంఆర్‌డిఎ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం పథకం గురించి వివరిస్తూ విద్యాశాఖ, నా ఆరోగ్యం - నా హక్కు అనే అంశంతో వైద్యారోగ్య శాఖ, పేదలందరికీ ఎన్‌టిఆర్ ఇళ్లు పథకంపై గృహ నిర్మాణ శాఖ, పేదరికం రహితం - పి4 విధానం పేరుతో ప్రణాళికా విభాగం, పిఎం సూర్యఘర్ ఆవశ్యకతను తెలుపుతూ ఇపిడిసిఎల్ శకటాలను ప్రదర్శించనున్నాయి. వివిధ శాఖలు స్టాళ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా వివిధ సంక్షేమ పథకాల కింద రూ.214.99 కోట్ల నగదు ప్రోత్సాహకాలను మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

అనకాపల్లి జిల్లాలో ఎన్‌టిఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుగనున్నట్టు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత జాతీయ పతాక ఆవిష్కరణ చేసి గౌరవ వందనం స్వీకరిస్తారని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటిని జయప్రదం చేయాలని ప్రజలను కోరారు.

అప్రమత్తంగా ఉండండి

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. చెట్లు పడి విద్యుత్ తీగలు తెగిపోకుండా కొమ్మలను ప్రూనింగ్ చేయించాలన్నారు. గాలులు వీచి చెట్లు పడిపోతే వెంటనే తొలగించడానికి విద్యుత్ రంపాలు, ప్రొక్లినర్లు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తీసుకు వెళ్లాలన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా లీకేజీలు ఉన్న పైప్ లైన్లను గుర్తించి మరమ్మతులు చేయించాలన్నారు. ఆసుపత్రులలో అవసరమైన అన్ని మందులూ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కొండ ప్రాంతంలో ఉన్న వారిని వార్డు సెక్రటరీలు అప్రమత్తం చేయాలన్నారు. పునరావాస కేంద్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. శిథిలావస్థలో ఉన్న సామాజిక భవనాలలోకి ప్రజలు వెళ్లకుండా చూడాలన్నారు.

వర్షాల నేపథ్యంలో జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు, కొండవాలు ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో వర్షాల వల్ల కలిగే ప్రమాదాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అన్ని జోనల్ స్థాయి అధికారులు జోనల్ కంట్రోల్ రూమ్స్‌లో 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితిలో జివిఎంసి సిటీ ఆపరేషన్ సెంటర్‌ను సమాచార కేంద్రంగా వినియోగించుకోవాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో అనకాపల్లి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. ప్రజలు సహాయం కోసం 08924222888, 08924225999, 08924226599 నెంబర్లకు ఫోన్ చేయాలని తెలిపారు.



నినాదాలు చేస్తున్న కెవిపిఎస్, ప్రజా సంఘాల నాయకులు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న అన్నారు. గురువారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం మన సొంతమన్నారు. దేశంలో ఎన్నో సంస్కృతులు, సాంప్రదాయాలు, మరెన్నో కులాలు, మతాలు భాషలు ఉన్నప్పటికీ 75 సంవత్సరాలుగా మనల్ని ఐక్యంగా ఉంచి నడిపించింది మన రాజ్యాంగమేనన్నారు. నేడు మతోన్మాదులు ఆర్ఎస్ఎస్ రూపంలో భారత రాజ్యాంగాన్ని చిన్నాభిన్నం చేసే ప్రమాదం పొంచివుందన్నారు. ప్రజలందరూ సమానంగా, ఐక్యంగా ఉండడం ఇష్టంలేక రాజ్యాంగ పీఠికల నుండి సోషలిస్ట్, సెక్యులర్ పదాలను తొలగించాలని చూస్తున్నట్టు తెలిపారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సుబ్బారావు మాట్లాడుతూ బిజెపి విద్యను కాషాయీకరణ గావించిందని, చరిత్రను వక్రీకరించి స్వాతంత్ర్య పోరాటంలో వెన్ను చూపినవారిని దేశభక్తులుగా చిత్రీకరిస్తోందని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలన్నింటిలోనూ ఆర్ఎస్ఎస్ వారితో నింపి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోందన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడితే మొట్టమొదట నష్టపోయేది దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలు, మైనారిటీలేనని, కాబట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వైటి.దాస్, వై.రాజు, ఐసిఎస్.నాయుడు, నాయకులు సోమాదుల గణేష్, పార్థ సారధి, ఇమ్మాన్యూలు, సరోజినమ్మ, మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, రజక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌పై విదసం నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 'భారత ఎన్నికల కమిషనర్‌గారూ మా ఓటు జర భద్రం, చోరీ కానివ్వకండి. ఓటు చోరీపై ప్రజలకు సమాధానం చెప్పండి, బీహార్ ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఆపండి' అంటూ విదసం (విస్తృత దళిత సంఘాలు) ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఓట్ చోరీపై ఇసిని నిలేద్దాం - ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం అంటూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద విదసం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. జాజి ఓంకార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నేతలు సోడదాసి సుధాకర్, గుడివాడ ప్రసాద్, బూల భాస్కర రావు, డి.నిర్మల, ఫ్రాన్సిస్, ఉత్తరాంధ్ర రాజ్యాంగ హక్కుల నేత బాగం గోపాల్, భారత నాస్తిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, పట్టా రామప్పారావు, నవయాన బహుజన నేత కొత్తపల్లి వెంకట రమణ, బీమ్ సేన్ వార్ నాయకులు రాజేంద్ర ప్రసాద్, దుర్గారావు, జనార్ధన్, ఎస్.ఎ.రావు, కొల్లా బత్తుల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

డిసిఐ రాబడి రూ.242.24 కోట్లు

- గతం కంటే 61 శాతం అధికం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నంలో కేంద్ర కార్యాలయం కలిగిన ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) తన వార్షిక క్వార్టర్ రెవెన్యూ లెక్కలను గురువారం రాత్రి విడుదల చేసింది. 2025-26 క్వార్టర్‌లో అత్యంత బలమైన రెవెన్యూ గ్రోత్‌ను సాధించామని వెల్లడించింది. ఈ మేరకు రెవెన్యూ ఆపరేషన్స్ ఈ క్వార్టర్ ఫైనాన్షియల్ ఇయర్‌లో రూ.242.24 కోట్లు రాగా, ఇది గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన రూ.151.65 కంటే (61 శాతం రూ.91.44 కోట్లు) అధికమైన ఆర్జన అని పేర్కొంది. ఎబిటా (ఎర్నింగ్స్ బిఫోర్ ఇంటరెస్ట్, టాక్సెస్ గ్రోత్) 283 శాతంగా ఉందని సంస్థ వెల్లడించింది.

పబ్లిక్ నోటీసు

ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్.,

(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమసంస్థ యొక్క అనుబంధ సంస్థ)

రి.నెం., ABC - CS/006/2015

H .O.: ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521225, Ph: 0866-6650307

BO: ABC-CS, Flat No. F1, HSR Enclave, Opp. Union Bank of India, Main Road, Akkayyapalem, Visakhapatnam - 530016. Ph: 0891 - 2561655

ఈ ప్రకటనలోని వారి తాలుకు దిగువ ఉదహరించిన స్థిరాస్థిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొందుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖా పై, సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోపుగా లిఖిత పూర్వకముగా అభ్యంతరములను రిజిస్టర్ పోస్ట్ విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారా మా సొసైటీ కు తెలియపరచవలసినదిగా కోరుతున్నాము.

Sl.No.	Applicant Name & Present Residence Address	Description of the Property
1	**Smt. ARIKIREVULA. ROHINI.** GL No : 50480 W/o. Sri. A. Narayana Murthy. Cell 9642192662 9346925522, 7036841780	The property in an extent of 150.00 Sq. Yards of house site along with RCC roofed ground floor residential building therein, in Survey. No.121/2, Door No: 16-30/24/2, Plot.No.29P, Ward.No.71, Asst. No.1086438120, Back to Police Station, 3rd Lane, Sai Niranjan Colony, Doggavanipalem, Pendurthi (V&M), Visakhapatnam District –531173. Value Rs.29.94.Lakhs.

Visakhapatnam
Dt. 14-08-2025

Branch Manager,
SRINIVASA RAO TATA 9281029463/9848141269

మహారాజా శ్రీ ఎలమంచిలి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్) డివిజన్
E.P. 60/14, O.S 221/04

పిటిషనర్ (DHr) : కట్ట కమల్ కుమారి భర్త వెంకట రాజా సుబ్రమణ్యం, 45 సం, గృహిణి యలమంచిలి.

రెస్పాండెన్స్ (J.Drs)
1.పందల గంగరాజు (డైడ్),
2.పందల నూకాలమ్మ, భర్త లేట్ గంగరాజు, 65 సం॥, వ్యవసాయం, పెద్దపల్లి H.No.27 ఎర్రవరం, యలమంచిలి మండలం
3. సురకాసుల సత్యవతి, భర్త శ్రీనివాస్‌రావు, 30 సం॥, గృహిణి, ధర్మవరం వీధి, యలమంచిలి.
4. బద్ధి రమణమ్మ, భర్త సత్తిబాబు, 40 సం॥, గృహిణి, శ్రామిక నగరం, గాజువాక, విశాఖపట్నం.
5. పడాల యేసు, భర్త మంగ, 37 సం॥, గృహిణి, శ్రామిక నగరం, గాజువాక, విశాఖపట్నం.
6. జవాబుల భవాని, భర్త రమణ, 35సం॥, గృహిణి, రాజాల, రాంబిల్లి మండలం
7. పందల భాగ్యలక్ష్మి, D/o. Late గంగరాజు 34 సం॥ నిరుదోగి, పెద్దపల్లి, H.No. 27, ఎర్రవరం, యలమంచిలి మండలం

పై నెంబర్ అమలులో పిటిషనర్ (D.Hr) తనకు రావాల్సిన తనకా బాకి వసులు నిమిత్తం పై అమలు దాఖలు చేయగా, ఆ అమలులో మీలో 4,5 వ రెస్పాండెంట్స్ (J.Drs) నోటీసులు తీసుకొనక, కాలయాపన చేయుచున్నారు అని శ్రీకోర్ట్ వారు పై పేపర్ పబ్లికేషన్స్‌కు ఉత్తరువులు ఇచ్చి ఉన్నారు. సదరు అమలు **తేదీ:18-08-2025కి** వాయిదా అయ్యివున్నది. ఆ రోజు **ఉదయం గం.10:30 నిమిషాలకు** మీరు స్వయంగా కానీ (లేదా) మీ తరపున వకీలు ద్వారా గాని పై కోర్ట్‌కి హాజరు అయ్యి మీకు గల ఆక్షేపణలు తెలుపోకోవలిసినది. లేని యెడల సదరు అమలు మీ పరోక్షమున తీర్మానించ బడును.

వాయిదా తేదీ: 18-08-2025.

వై.రాఘవేంద్రరావు
పిటిషనర్ తరుపు అడ్వకేట్,
యలమంచిలి గాంధీనగరం, యలమంచిలి
తేది:14-08-25 సెల్: 9440559429.

IN THE HON'BLE COURT OF THE II ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT: VISAKHAPATNAM
I.P. 11/2025

Between:
Amballa Satyavathi, W/o. Bangaru Naidu, Hindu, aged 41 years, R/at D.No.9-315, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-530027 **...Petitioner**

And:
R-1: **Veligapu Lakshmi,** W/o. Tirupathi Rao, Hindu, 40 years, R/at D.No.9-315, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-2: **Ponnada Ramamurthy**, S/o. Not known, Hindu, 45 years, Rest-do-
R-3: **Yegi Reddi Lakshmi,** Hindu, 56 years, Rest-do-
R-4: **Naveti Raju**, S/o. not known, Hindu, 27 years, R/at D.No. 9-253/4, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-5: **Kantamsetti Raghava Rao**, S/o. not known, Hindu, aged 50 years, Rest -do-
R-6: **Lakshmi**, W/o. not known, Hindu, aged 50 years, D.No. 9-253/2, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-7: **Nunela Lakshmi,** W/o. Chinnam Naidu, Hindu, 50 years, R/at D.No.9-247, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-8: **Ommi Appayyamma**, W/o. not known, Hindu, about 70 years, R/at D.No.9-146, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-9: Sambana Varalakshmi, W/o. Ramunaidu, Hindu, 50 years, R/at D.No.13-60/1, Indira Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-10: Guthula Kumari, W/o. Chanti, Hindu, 40 years, R/at D.No.9-32, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-11: Orupalli Govindamma, W/o. not known, Hindu, 55 years, R/at D.No.9-248, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-12: Uppili Ragavammai, W/o. Bangaru Raju, Hindu, 45 years, R/at D.No.9-32, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-13: Pakki Siva Lakshmi, W/o. not known, Hindu, 55 years, R/at D.No.9-170, Narasimha Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-14: Gummala Surya Prakash, S/o. Ganaga Raju, Hindu, 47 years, R/at D.No.13-147, Indira Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-15: Nadiminchi Shanthi Naidu, S/o. not known, Watch Man, Hindu, 40 years, R/at Ghadhiraju Palace, Beach Road, Sector-11, M.V.P. Colony, Visakhapatnam-27.
R-16: Chenna Appa Rao, S/o. not known, Hindu, 62 years, R/at D.No.13-167, Indira Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-17: Bangaru Raju, S/o. not known, Hindu, 50 years, R/at D.No.13-166, Indira Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-18: Sambana Kanaka Mahalakshmi, W/o. not known, Hindu, 35 years, R/at D.No.7-16-42, 1st Floor, Bus Stop, Service Road, Opp. Signal Point, above SBI ATM, Old Gajuwaka, Visakhapatnam.
R-19: Kavicharla Ramalakshmi, W/o. not known, Hindu, 40 years, R/at D.No.13-166, Indira Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-20: Boyidapu Papayyamma, W/o. not known, Hindu, R/at D.No.5-164/5, SC BC Colony, Venkatapuram, Near Gopalapatnam Petrol Bunk, Gopalapatnam, Visakhapatnam-27.
R-21: Gowdi Rama Rao, W/o. not known, Hindu, 47 years, R/at D.No.13-115/2, Indira Nagar, Gopalapatnam, Visakhapatnam-27.
R-22: Petakamsetti Sesheswara Rao, S/o. not known, Hindu, R/at D.No.35/1/25, Gopalapatnam, Visakhapatnam-27. **...Respondents**

GENERAL NOTICE

The public are hereby informed that the above named petitioner filed the above I.P. 11/2025 on the file of the Hon'ble II Addl. Civil Judge (Senior Division) at Visakhapatnam to declare her as an insolvent and the matter stands posted to **18-08-2025** for hearing. So public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **18-08-2025** either in person or through an Advocate at **10:30 A.M.**

(By Order of the Hon'ble Court)
V.V. APPA RAO & B. MEENA,
Advocates, Visakhapatnam-16
Cell: 99129 54756.

తవిటకొండలో గ్రావెల్ మాయ

- రాత్రింబవళ్లు మట్టి తరలింపు
- ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు



మట్టిని తరలించిన రామవరం తవిటకొండ ప్రాంతం

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం రామవరం రెవెన్యూ పరిధి సర్వే నెంబరు1లో తవిటకొండ ప్రాంతంలో భారీ స్థాయిలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ప్రభుత్వ భూమిలో ఎటువంటి అధికార అనుమతులు లేకుండా మట్టిని తవ్వి తరలించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం... ఇప్పటివరకు 800కు పైగా లారీల మట్టి తరలించుకుపోయినట్లు చెబుతున్నారు. ఈ మట్టిని రాజుగారి తోట, లే-అవుట్లు, సైలెంట్ వ్యాల్యూ వంటి ప్రైవేట్ ప్రాజెక్టులకు తరలించి దాదాపు రూ.30 లక్షలకుపైగా ఆదాయం సంపాదించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ దందా వెనుక స్థానిక అధికార పార్టీకి చెందిన ఓ ప్రముఖ నాయకుడి హస్తం ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మైనింగ్ శాఖ అనుమతులు లేకపోయినా, మట్టి తరలింపులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. శని, ఆదివారాల్లో రాత్రింబవళ్లు మట్టిని తరలించి, పచ్చని కొండను విచ్ఛిన్నం చేస్తూ పర్యావరణాన్ని హానిచేస్తున్నారు. ఈ తవ్వకాల వల్ల స్థానిక పరిసర గ్రామాలకు పర్యావరణ ముప్పు తప్పదని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఇలాంటి దందాలను అరికట్టి, తవిటకొండను కాపాడాలంటూ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ప్రయివేటు ట్రావెల్ బస్సు ఢీకొని ఒకరు మృతిచెందారు. పోలీసుల కథనం ప్రకారం... వేములవలస పంచాయతీ కామత్ హోటల్ సమీపంలోని సత్యకల్యాణ్ అపార్ట్‌మెంట్‌లో నివసించే నేతల సాయికుమార్ (48) బుధవారం రాత్రి హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఆనందపురం నుండి విశాఖపట్నం వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. సాయికుమార్ రహదారిపై కొంత దూరం ఎగిరిపడి, తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. 108 సహాయంతో సాయికుమార్‌ను సమీపంలోని పినాకిల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొన్ని గంటల్లోనే ఆయన మృతి చెందారు. సాయికుమార్ భార్య నేతల కల్యాణి గజపతినగరం ఎంపిడిఒగా పనిచేస్తున్నారు. సాయి కుమార్ సింగపూర్‌లో ఇంజినీర్‌గా పనిచేశారు. గత నాలుగేళ్లుగా వేములవలస సత్య కల్యాణ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. భార్య కల్యాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ సిహెచ్.వాసునాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిట్టీల పేరుతో మోసం : నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-గోపాలపట్నం : చిట్టీల పేరుతో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా తిరుగుతున్న నిందితులపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. గోపాలపట్నం సిఐ ప్రభాకర్ కథనం ప్రకారం... జివిఎంసి 92వ వార్డు పరిధి ఇందిరానగర్‌లో నివాసముంటున్న అంబల్ల సత్యవతి, ఆమె కుటుంబ సభ్యులు అంబల్ల బంగారునాయుడు, అంబల్ల తేజస్విని, అంబల్ల నాగలక్ష్మి కలిసి చీటీల వ్యాపారం చేశారు. స్థానికుల నుంచి చిట్టీల పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలుచేసి తిరిగి చెల్లించకుండా మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

యువకుని అదృశ్యం

ప్రజాశక్తి- గొలుగొండ: మండలంలోని ఎ.ఎల్.పురం గ్రామానికి చెందిన లోకవరపు బుచ్చియ్యనాయుడు(32) వారం రోజుల నుండి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. విశాఖలో రియల్ ఎస్టేట్‌లో పనిచేస్తున్న అచ్చియ్యనాయుడు, ఈ నెల 6వ తేదీ రాత్రి ఇంటికి వస్తున్నట్లు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. . అయితే అతను ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చిందని, అతని కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అచ్చియ్యనాయుడు ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9440904240కి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కాగా కుమారుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చీడికాడ : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మరణించిన ఘటన చీడికాడ మండలం ఖండివరం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలివి. గేదెలను మేతకు తీసుకెళ్లిన ఈర్లె రామినాయుడు, పశువులను మేపే క్రమంలో చెరువులో దిగాడు. అయితే ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో సమీపంలో ఉన్న వ్యక్తులు గాలించి,రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. చెరువు నీటిలో మునిగి రామునాయుడు మృత్యువాత పడ్డాడు. అందిన సమాచారం మేరకు చీడికాడ ఎస్ఐ సతీష్ సంఘటనాస్థలాన్ని సందర్శించారు. మృతదేహాన్ని వెలికితీయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురంలో ఎస్‌టిబిఎల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మన్యం పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం నాగవంశం గ్రామానికి చెందిన శంకర్రావుతో కొండల గాయత్రి (21)కి గత సంవత్సరం మార్చి నెలలో వివాహమైంది. శంకరరావు స్థానిక ఎంఎస్ఎంఈలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. వీరు ఎస్‌టిబిఎల్ ప్రాంతంలో నివాసముంటున్నారు. బుధవారం ఉదయం శంకరరావు డ్యూటీకి వెళ్లారు. రాత్రి 8.30 గంటలకు డ్యూటీ నుండి ఇంటికి వచ్చే సరికి గాయత్రి చున్నీతో వంట గదిలో ఉరి వేసుకుని మృతి చెంది ఉంది. ఆమె మృతి పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్‌రావు తెలిపారు.

17న భూలోకమాత పండగ

ప్రజాశక్తి- ఆనందపురం : లోడగలవానిపాలెం పంచాయతీ పరిధిలోని ఆనందపురం హైస్కూల్, బీసీ యాదవుల కాలనీ సమీపంలో గల భూలోకమాత అమ్మవారి పండుగను ఈ నెల 17వ తేదీన నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సన్నాహాలు ముమ్మరం చేసింది. ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమలు, సాయంత్రం 6.30 గంటలకు గ్రామంలోని దేవుడి ఇంటి నుండి ఆలయం వరకు శోభాయాత్ర (ఊరేగింపు) ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశమున్నందున, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్ల కోసం ఆనందపురం పోలీస్ స్టేషన్ హౌస్ అధికారికి వినతిపత్రం సమర్పించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పాండ్రంగి గోస్తని కల్వర్టుపై బారికేడ్లు

ప్రజాశక్తి -పద్మనాభం : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గోస్తనీ నది నీటిమట్టం పెరగడంతో కల్వర్టుపై బారికేడ్లు ఏర్పాటుచేయాలని రెవన్యూ, ఇరిగేషన్, అగ్నిమాపక, పోలీసు శాఖ అధికారులకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆదేశించారు. గురువారం గోస్తనీని పరిశీలించి, బోని ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించాలని, గోస్తనీ వద్ద హెచ్చరిక బోర్డు, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ప్రారంభించాలన్నారు.

హైస్కూల్‌కు ప్లాస్టిక్ కుర్చీల వితరణ

ప్రజాశక్తి- భీమునిపట్నం : మండలంలోని తాటితూరు జెడ్పీ హైస్కూల్‌కు అదే గ్రామానికి చెందిన ఎస్.పార్వతమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు జాంబ రెడ్డి సుమారు 5 వేలు విలువైన 10 ప్లాస్టిక్ కుర్చీలను గురువారం పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎంకె.వెంకటేశ్వరరావుకు అందజేశారు. దాతను ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో హిందీ ఉపాధ్యాయులు టిఎస్‌వి ప్రసాదరావు, ఎస్ఎంసి ఛైర్మన్ బి.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు సూర్య, లలిత, మోహనరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగునికి పింఛన్ రద్దు నోటీసు

- పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్నా తొలగింపు



వంకరపోయిన చేతి వేళ్లను చూపిస్తున్న గణేష్

ప్రజాశక్తి-ఆనందపురం : పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్నప్పటికీ పింఛన్‌ను రద్దు చేస్తూ నోటీసు రావడంతో వికలాంగుడు, అతని తల్లి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనందపురం మండలం సిర్లపాలెం గ్రామానికి చెందిన కోరాడ అప్పలనారాయణమ్మ కుమారుడు కోరాడ గణేష్ (22) కుడిచేతి అంగవైకల్యం ఉంది. మందబుద్ధితోపాటు చిన్నప్పటి నుంచీ ఫిట్స్ సమస్యతో బాధపడుతున్నాడు. ప్రతిరోజూ మందులు వాడుతుంటాడు. పుట్టుకతోనే అంగవైకల్యం కారణంగా గణేష్‌కు ప్రభుత్వం అనేక ఏళ్లుగా వికలాంగుల పింఛన్ వస్తోంది. కూటమి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన పింఛన్ అర్హత పరిశీలనలో భీమునిపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో అతన్ని తనిఖీ చేశారు. అన్ని రకాల పత్రాలు తీసుకొని అర్హత సరిపోయినట్లు నిర్ధారించారు. రెండు నెలల తర్వాత అర్హత లేదంటూ నోటీసు జారీ చేశారు. సచివాలయ సిబ్బంది పింఛన్ రద్దు కోసం సంతకం చేయాలని చెప్పడంతో తల్లి అప్పలనారాయణమ్మ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భర్త కోరాడ అప్పారావు మృతి చెందడంతో కుటుంబం పూర్తిగా పింఛన్‌పై ఆధారపడుతోంది. పైగా అప్పలనారాయణమ్మ కూడా అనారోగ్యంతో మంచానపడ్డారు. కుమారుడు పుట్టుకతోనే అంగవైకల్యడని, అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చిందని, ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి పింఛన్ మళ్లీ మంజూరు చేయాలని తల్లి అప్పలనారాయణమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రెస్టారెంట్లు, వెల్డింగ్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీ



వెల్డింగ్ దుకాణం వద్ద తనిఖీ చేస్తున్న ఆర్‌డిఒ సంగీత్ మాథుర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఫిషింగ్ హార్బర్ ఏరియాలోని వెల్డింగ్ దుకాణంలో ఇటీవల జరిగిన పేలుడు ఘటన నేపథ్యంలో గురువారం రెవెన్యూ, జివిఎంసి, సివిల్ సప్లై, అగ్నిమాపక శాఖ అధికారులు కలిసి స్థానికంగా ఉన్న పలు వెల్డింగ్ దుకాణాలు, రెస్టారెంట్లలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. గృహాల్లో వంటకు వాడే గ్యాస్‌ను రెస్టారెంట్లు, వెల్డింగ్ దుకాణాల్లో వినియోగిస్తున్నట్లు సంబంధిత అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఇందుకు సంబంధించి ఆయా వెల్డింగ్ దుకాణాలు, రెస్టారెంట్ల యజమానులపై 6ఎ కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో స్థానిక ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, చిట్టివలస ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరాజు ఉన్నారు.

గండిగుండంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం గండిగుండం గ్రామంలో గురువారం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి గనిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మాట్లాడుతూ, ఎన్నికల ముందు అబద్దాలు చెప్పి ఓట్లు గెలుచుకున్న కూటమి ప్రభుత్వం, ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎక్కడి నుంచైనా ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు కేవలం 5 రకాల బస్సులకే పరిమితం చేయడం మోసమేనన్నారు. దీని వల్ల విశాఖ నుంచి తిరుపతి వెళ్లడానికి వారం రోజులు, అన్నవరం వెళ్లడానికి మూడు రోజులు పడుతుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి పాండ్రంగి శ్రీను, మామిడిలోవ ఎంపిటిసి డోలా గౌతమి, బల్రెడ్డి మహేష్, బోని అప్పలనాయుడు, చందక సూరిబాబు, చందక ప్రెసిడెంట్ బంక శ్రీను, షిణగం దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.


కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

కాంట్రాక్టర్లకు బకాయిల చెల్లింపు

ప్రజాశక్తి-పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 2014 -2019 మధ్యకాలంలో తెలుగుదేశం ప్రభుత్వంలో పనిచేసిన 41 మంది కాంట్రాక్టర్లకు బకాయి పడ్డ బిల్లులను మొదటి విడతగా రూ.86.27 లక్షలు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. సుజాతనగర్ క్యాంపు కార్యాలయంలో గురువారం పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ 2014 - 2019 సంవత్సరం మధ్యకాలంలో పనిచేసిన కాంట్రాక్టర్లకు జగన్మోహన్‌రెడ్డి వదిలేసి వెళ్లిపోయిన ప్రతి బకాయినీ కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండి పాత బకాయిలను కూడా చెల్లిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, మణి కుమార్, ఎంపిడిఒ అప్పలరాజు, రమేష్‌నాయుడు, శివ, డిఇ పివి.రమణమూర్తి, ఎఇ హరిణి, స్వాతి అధికారులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ వాలంటీర్లకు అవార్డులు

ప్రజాశక్తి -ములగాడ : సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం వాలంటీర్లకు ఆంధ్ర విశ్వవిద్యాలయం అవార్డులను ప్రకటించింది. బిఎ విద్యార్థినులు పి.దివ్యశ్రీ, ఎం.జెస్సికా, బికాం విద్యార్థినులు ఇ.స్రవంతి, కె.యామినికి అవార్డులను ప్రకటించారు. జాతీయస్థాయి కార్యక్రమాలలో పాల్గొన్న దివ్యశ్రీ, స్రవంతి, యామినీలకు యూనివర్సిటీ స్థాయి అవార్డులు, జెస్సికాకు జిల్లా స్థాయి అవార్డు లభించాయి. వీరంతా స్వాతంత్య్ర దినోత్సవం నాడు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య జిపి.రాజశేఖర్ ద్వారా అవార్డులను అందుకోనున్నారు. ఈ సందర్భంగా వీరిని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డి.సింహాచలం, జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయ దేవి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి, అధ్యాపకులు అభినందించారు.


సామాజిక భవనం ప్రారంభంలో ఎమ్మెల్యే వెలగపూడి

సామాజిక భవనం ప్రారంభం


ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి ఆరిలోవ అప్సరా కాలనీ -2లో నిర్మించిన సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం ప్రారంభించారు. అదే కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన సింటెక్స్ వాటర్ ట్యాంక్‌ను కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి ఇన్‌ఛార్జి రాగతి అచ్యుతరావు, అధ్యక్షులు ముగడ రాజారావు, పేపర్ నాయుడు, బోడ లక్ష్మణరావు, పార్లమెంటరీ కార్యదర్శి ఎం.కృష్ణంరాజు, మూది అప్పారావు, సబ్బవరపు అప్పలనాయుడు, రేఖా జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఆనందపురం : గంభీరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఫ్లోరోసిస్ వ్యాధిపై జిల్లా ఫ్లోరోసిస్ నివారణ నియంత్రణ విభాగం కన్సల్టెంట్ డాక్టర్ విశ్వనాథం గురువారం అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్ వ్యాధి పెద్దల కంటే పిల్లల్లో ఎక్కువగా కనిపించే అవకాశం ఉందని చెబుతూ విద్యార్థుల దంతాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు దీనిపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్స్, సుపారి, బ్లాక్ టీ, ఫ్లోరైడ్ అధికంగా ఉన్న టూత్‌పేస్ట్ వంటివి వాడరాదని చెప్పారు. విటమిన్లు సి, ఇ సమృద్ధిగా ఉన్న పాలు, పెరుగు, జున్ను, ఉసిరి, జామ, నిమ్మ, చిరుధాన్యాలు, ఆకుకూరలు వంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి కల్పన, ప్రధానోపాధ్యాయుడు యువిఎస్.ప్రసాద్, ఉపాధ్యాయులు లలిత, లక్ష్మి శివగంగ, విద్యార్థులు పాల్గొన్నారు.

భయం గుప్పెట్లో కొండవాలు ప్రాంతాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : వర్షాకాలం వచ్చినా, వరుస వర్షాలు పడినా, తుపాను సంభవించినా కొండవాలు ప్రాంతాల ప్రజలు భయం గుప్పెట్లో పెట్టుకొని గడపాల్సిందే. ఎక్కడ కొండచరియలు విరిగి పడతాయో, రక్షణగోడలు కూలుతాయో, ఇళ్లపై ఇళ్లు కూలుతాయోనని కొండవాలు ప్రాంతాల్లో ఉండే వారు చిగురుటాకుల్లా అల్లాడిపోతుంటారు. తూర్పు నియోజకవర్గం పరిధి హనుమంతువాక నుంచి దీనదయాల్‌పురం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల పరిధిలో పదుల సంఖ్యలో కాలనీలు కొండవాలు ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఆదర్శనగర్, రవీంద్రనగర్, పాత ఆరిలోవ, తోటగరువు, బిఎన్‌ఆర్.నగర్, ఆరిలోవ కాలనీలు కొండవాలు ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఇక్కడ నివసిస్తున్న వారిలో చాలా మంది నిరుపేదలే. కొద్దిపాటి వర్షాలు పడితే వారి గుండెల్లో గుబులు మొదలవుతోంది. ఇటీవల వర్షాలు పడతాయని హెచ్చరికలు జారీ కావడంపై ఇక్కడ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇప్పటికే హనుమంతువాక నుంచి దీనదయాల్‌పురం, మరికొన్ని ప్రాంతాల్లో కొండచరియలు జారిపడకుండా రిటర్నింగ్ వాల్స్ నిర్మించగా మరికొన్ని ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో నిర్మించాల్సి ఉంది. ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టాలంటే ప్రమాదకరమైన చోట రిటర్నింగ్ వాల్స్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


ఆరిలోవ బిఎన్ఆర్.నగర్

విద్యుత్ స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి



మాట్లాడుతున్న ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి -ములగాడ : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ జివిఎంసి 60 వార్డు కార్యాలయం వద్ద జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇంటికి పెట్టడానికి వస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అదానికి దాసోహమై ఈ స్మార్ట్ మీటర్లు పెట్టి, ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గం అన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల సెల్‌ఫోన్ మాదిరిగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఛార్జీలు విపరీతంగా పెరుగుతాయని చెప్పారు. సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు పి.పైడిరాజు మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను బద్దలుకొట్టండి అని చెప్పి, ఇప్పుడు వాటిని పెట్టేందుకు అనుమతివ్వడాన్ని తీవ్రంగా విమర్శించారు. జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్.లక్ష్మణమూర్తి, సిఐటియు నాయకులు బి.రాంబాబు, డి.రాము, బి.సూరిబాబు, కృష్ణకుమార్, రామారావు, గంగులు, నాగరాజు, అప్పలకొండ, దేవి, శ్యామల, దుర్గ, సి.హెచ్.లక్ష్మి, బి.రమణమ్మ మీనా, సీత, జగదీశ్వరి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న క్రికెట్ క్రీడాకారులు

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని ఎపిఎల్ సింహాద్రి వైజాగ్ లయన్స్ క్రికెట్ జట్టు సభ్యులు గురువారం దర్శించుకున్నారు. జట్టు సభ్యులకు ఆలయ పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు సాదర స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతర క్రికెట్ జట్టు సభ్యులకు వేద పండితులచే వేద ఆశీర్వచనం అందించారు. తరువాత స్వామివారి ప్రసాదాలను ఆలయ అధికారులు అందజేశారు.


సింహాచలం దేవస్థానంలో క్రికెట్ క్రీడాకారులు

తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛభారత్


స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-ములగాడ : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ములగాడ తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న శ్రీకృష్ణుని విగ్రహం వద్ద ప్రతిభ పాఠశాల ప్రిన్సిపల్ తోణంగి వెంకటరమణి సహకారంతో విద్యార్థులు గురువారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహ పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ, ఏటా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు సహకరించడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

250 అడుగుల త్రివర్ణ పతాకంతో పరేడ్

ప్రజాశక్తి-సీతమ్మధార : స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెం ఎన్జీవోస్ కాలనీలోని జివిఎంసి ఉన్నత పాఠశాల ఎన్‌సిసి విద్యార్థులు 250 అడుగుల త్రివర్ణ పతాకంతో పరేడ్ నిర్వహించారు. పాఠశాల ఎన్‌సిసి చీఫ్ ఆఫీసర్ ఎంఎన్‌వి.విశ్వనాథం నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీని ప్రధానోపాధ్యాయులు జయంతి రాధాకుమారి జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు యుఎన్.రత్నం, ఆర్.శ్రీనివాసరావు, శ్యామల, గ్లోరీ, హేమ తదితరులు పాల్గొన్నారు.

'స్వేచ్ఛగా ఎన్నికలు'

ప్రజాశక్తి-గోపాలపట్నం : పులివెందుల, ఒట్టిమిట్ట జడ్‌పిటిసి బై ఎలక్షన్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగాయని ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు చెప్పారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన 30 ఏళ్లలో ఎన్నికలు నిర్వహించకుండా, ఏకగ్రీవాలతో రాజకీయాలు నడిపారని విమర్శించారు. నేడు స్వేచ్ఛాయుత వాతావరణంలో అక్కడి ప్రజలు ఓటు హక్కును వినియోగించుకొని తెలుగుదేశం అభ్యర్థులకు భారీ మెజార్టీతో గెలిపించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు నారిపిన్ని సత్తిరాజు, యలమంచిలి ప్రసాద్ పాల్గొన్నారు.

విసిబి మధురవాడ శాఖ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మధురవాడ

జివిఎంసి 7వ వార్డు పరిధిలో ఉన్న ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు మధురవాడ శాఖ 15వ వార్షికోత్సవాన్ని బ్యాంకు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పినాకిల్ హాస్పిటల్, మాక్సీ విజన్ కంటి హాస్పిటల్, క్లోవ్ డెంటల్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు అధ్యక్షులు జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలు సంక్షేమం కోసం 2010 ఆగస్టు 14వ తేదీన ప్రారంభించిన విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ మధురవాడ శాఖ గడిచిన 15 సంవత్సరాలలో రూ.200 కోట్లు వ్యాపార లావాదేవీలు చేసిందని తెలిపారు. భవిష్యత్తులో కూడా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి బ్యాంకు కృషి చేస్తుందన్నారు. బ్యాంకు జోనల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ, మేనేజర్ ఎంవి.అప్పారావు, సిబ్బంది, పలువురు సమన్వయ కమిటీ సభ్యులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

పాలిథిన్ సంచులు స్వాధీనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలోని పలు మాంసం దుకాణాలను ప్రజారోగ్య విభాగానికి చెందిన సిబ్బంది గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 5 కిలోల పాలిథిన్ సంచులను స్వాధీనం చేసుకుని, సంబంధిత దుకాణ నిర్వాహకులకు జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో శానిటరీ మేస్త్రి రేగాని రవి, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు సురేష్, మనోజ్, త్రివేణి, శివ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్‌కు కృషి

రైతులు, కార్మికులకు ఎమ్మెల్యే రాజు హామీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం ప్రాంతంలో రైతులకు, కార్మికులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధినిస్తున్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఈ ఏడాది తిప్పేందుకు సాయిశక్తుల కృషి చేస్తానని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రుణాలకు ప్రయత్నం చేసి ఆదుకుంటానని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు హామీ ఇచ్చారు. చోడవరం ఫ్యాక్టరీ పరిరక్షణకై రైతులు, కార్మికులు, రైతు, కార్మిక సంఘాలు పోరుబాట పట్టడంతో పాటు గురువారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యేకు అనేక సూచనలు చేశారు. ఈ ప్రాంతంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ లేకపోతే ప్రజలందరికీ జీవనోపాధి పోతుందని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లో ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం నుంచి గ్రాంట్ రూపంలో నిధులు తీసుకొచ్చి ఆధునికరించడంతో పాటు రైతులు కార్మికులు బకాయిలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించి ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అనేక ఒడిదుడుకులతోనూ, అప్పులతో కొట్టుమిట్టాడుతోందని, ఈ పరిస్థితుల్లో ఈ ఫ్యాక్టరీ నడపడం కోసం కొన్ని ప్రత్యామ్నాయాలను కూడా ఆలోచిస్తున్నామని తెలిపారు. ఇథనాల్ ప్లాంటు లేదా డిస్టలరీ యూనిట్‌గా మార్పు చేయటం ద్వారా ఏరకంగా ఉపయోగపడుతుందో పరిశీలనలో ఉందని చెప్పారు. ఎలాగైనా ఈ ఫ్యాక్టరీ నడపడం కోసం సాయి శక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అయితే రైతాంగం మాత్రం దీనిని చెరుకు ఫ్యాక్టరీగానే నడపడం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు దొండుపాటి తాతారావు, కార్మిక సంఘం నాయకులు సరగడం రామునాయుడు, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, కొణతాల గంగేశ్వరరావు, కోన మోహన్, గుమ్మడి శ్రీరామ్, ఏడవాక శ్రీను, కొల్లి ప్రకాశరావు, రైతు సంఘాల నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, అయితిరెడ్డి సింహాచలం నాయుడు, పల్లేల వరహాలు బాబు, యస్‌వి నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సిపిఎం వినతి

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకునేందుకు నిధులు కేటాయింపునకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, రైతులు కార్మికులు బకాయిలు వెంటనే చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు వివి శ్రీనివాసరావు, గూనూరు వరలక్ష్మి, మండల నాయకులు ఎస్‌వి.నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. చోడవరం ప్రాంతంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీపై ఆధారపడి సుమారు 25 వేల మంది రైతు కుటుంబాలు ఉన్నాయని, ప్రత్యక్షంగా 1500 మంది కార్మికులు, పరోక్షంగా లక్ష కుటుంబాలకు ఈ ఫ్యాక్టరీ ఉపాధి కల్పిస్తుందని చెప్పారు. ఫ్యాక్టరీని ఆధునికీకరించి పూర్తి సామర్థ్యంతో నడపాలని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ రూపంలో నిధులు రాబట్టడం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యే రాజును సిపిఎం నేతలు కోరారు.



ఎమ్మెల్యేకు సమస్యలను తెలియజేస్తున్న సిపిఎం నేతలు



మూడు రంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబైన కలెక్టరేట్

స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబైన కలెక్టరేట్

ప్రజాశక్తి-అనకాపల్లి : 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. మువ్వన్నెల రంగుల కాంతుల వెలుగులో కార్యాలయ భవనం రాత్రి వేళ మరింత శోభను సంతరించుకుంది. దేశభక్తి భావాలను ప్రతిబింబించే విధంగా ఏర్పాటు చేసిన ఈ అలంకరణ నగర ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సహాయనిధి ద్వారా పలువురు అనారోగ్య బాధితులకు మంజూరైన చెక్కులను స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం పంపిణీ చేశారు. మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన లాలం వరహా నాగ సంతోష్‌కు రూ.57,038, పైడివాడ అగ్రహారానికి చెందిన బొబ్బరి ప్రసాద్‌కు రూ.29వేలు, బాటజంగాలపాలెం గ్రామానికి చెందిన కాపుశెట్టి వెంకట్‌కు రూ.2,59,085, సబ్బవరం పంచాయితీ జోడుగుళ్ళకు చెందిన సబ్బవరపు కాంతమ్మకు రూ.30వేలు, మొగలిపురం గ్రామానికి చెందిన సింగంపల్లి సన్యాసమ్మకు రూ.30వేలు, వంగలి గ్రామానికి చెందిన గొంప మహిధర్ సాయికు రూ.32,515, నారపాడు పంచాయితీ బలిజపాలెంకు చెందిన రాపర్తి వైష్ణవి తేజకు రూ.14,500 చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు కర్రి కనకరాజు, నాయకులు గండి దుర్గాప్రసాద్, సబ్బవరపు రవి, వెన్నెల నరేష్, లెక్కలు అప్పలనాయుడు, ఎంపీటీసీ కొండాజీ, సర్పంచ్ పడాల వెంకటరమణ పాల్గొన్నారు.

జగన్ పతనం మొదలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : పులివెందుల జడ్పిటిసి ఎన్నికల్లో టిడిపి విజయంతో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పతనం మొదలైందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందులలో ప్రజలు ఓట్లను స్వేచ్ఛగా వేసుకుంటే జగన్ రెడ్డిలో భయం మొదలైందన్నారు. సిఎం పదవిపోయి, ప్రతిపక్ష హోదా దక్కక, వైసిపి క్యాడర్ నిర్వీర్యం అయిపోవడంతో చంద్రబాబుపై అవాకులు చవాకులు పేలుతున్నాడని ఆరోపించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో చైతన్యకు స్వర్ణ పతకాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వేచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.చైతన్య రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించింది. చీరాలలో జరిగిన 36వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో చైతన్య చక్కని ప్రతిభ కనబరిచి, లాంగ్ జంప్, షాట్ పుట్, హార్డిల్స్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలను కైవసం చేసుకుంది. ఈ విద్యార్థినిని, ఆమెకు శిక్షణ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తమ్మి నాయుడును పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



స్వర్ణ పతకం సాధించిన చైతన్య

అభివృద్ధి పనుల బిల్లులు విడుదల

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎలమంచిలి నియోజకవర్గంలో 2014 -19 సంవత్సరాల మధ్య చేసిన ప్రభుత్వ అభివృద్ధి పనులకు రూ.29 లక్షల 12 వేలు బిల్లులను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ చేతులమీదుగా విడుదల చేశారు. అచ్చుతాపురంలో గురువారం ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే సమయాసమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు చేపట్టిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వలన అభివృద్ధి కుంటుపడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేకమైన శ్రద్ధ చూపించి నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ ప్రారంభం



ట్రాఫిక్ పోలీసులకు సామగ్రిని అందిస్తున్న ఎస్‌పి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్, అనకాపల్లి

అనకాపల్లి జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులను తగ్గించేందుకు స్మార్ట్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ కంట్రోల్ రూమ్‌ను నూతన పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గురువారం వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెరుగు బజార్ జంక్షన్, నాలుగు రోడ్ల జంక్షన్, నూకాలమ్మ ఆర్చ్ జంక్షన్ వద్ద సీసీటీవీ కెమెరాలు అమర్చి, వాటిని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశామని చెప్పారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా పట్టణంలోని 32 సీసీటీవీ కెమెరాలను పర్యవేక్షించవచ్చని పేర్కొన్నారు. మైక్ సిస్టమ్ ద్వారా కంట్రోల్ రూమ్ నుంచే ట్రాఫిక్ నియంత్రణ ఆదేశాలు ఇవ్వవచ్చని తెలిపారు. డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలో స్మార్ట్ పోలీసింగ్ అమలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా డ్రోన్లు, అధునాతన సీసీటీవీ కెమెరాలు వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, శాంతి భద్రతలతో పాటు ట్రాఫిక్ వ్యవస్థను మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి కారణంగా రహదారులపై వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయని, వాటిని పరిష్కరించేందుకు జిల్లా ఎస్పీ డీసీఎంఎస్ ప్రాంగణాన్ని పార్కింగ్ స్థలంగా అభివృద్ధి చేయాలని సూచించగా, వెంటనే అంగీకరించినట్లు వెల్లడించారు. సబ్ డివిజన్ డిఎస్పీ ఎం.శ్రావణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ ఆధ్వర్యంలో పాడైన ప్రాంగణాన్ని ప్రజల సౌకర్యానికి అనుగుణంగా మలచడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్నీ బాలాజీ, అనకాపల్లి డిఎస్పీ ఎం.శ్రావణి, ఉమెన్ పోలీస్ స్టేషన్ డిఎస్పీ ఈ.శ్రీనివాసులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, వెంకటనారాయణ, విజయకుమార్, అశోక్ కుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరోక్షంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు?

కూటమి ప్రభుత్వ తీరుపై అన్ని వర్గాల్లో అనుమానాలు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్

ఏపీలో కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరు ప్రస్తావించకుండానే దానిని అమలు చేస్తుందా? కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసే అధికారం అప్పగించినట్లు ప్రచారం ఊపందుకోవడంతో అవుననే భావన అంతటా వ్యక్తమవుతుంది.

నిజానికి ఎన్నికల సమయంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు అంశాన్ని టీడీపీ కూటమి ప్రధాన ఆయుధంగా మార్చుకొని ప్రచారం చేసింది. ఈ యాక్ట్ అమలైతే పేదల భూములు కాజేయబడతాయని, కోర్టుల అధికారాలు పోతాయి, ప్రజల భూములపై హక్కులు తగ్గుతాయి అంటూ ప్రచారాన్ని కూటమి నేతలు ఊరూరా ఊదరగొట్టారు. అనుకూల మీడియా కూడా అదే ప్రచారం చేయడంతో ప్రజల్లో ఒకింత ఆందోళన వ్యక్తమైంది. ఈ యాక్ట్ జగన్ ఓటమికి ప్రధాన కారణమైందనే వాదన కూడా ఉంది. అటు న్యాయవాద వర్గాలు కూడా దీన్ని స్వేచ్ఛపై దాడిగా భావించి, కోర్టుల హక్కుల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి.

గెలిచాక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు ముఖ్యమంత్రిగా తొలి సంతకాన్ని చంద్రబాబు చేశారు. కానీ ఇప్పుడు, ఎటువంటి అధికారిక ప్రకటన లేకుండానే, అదే లక్ష్యాలతో కలెక్టర్ నేతృత్వంలోని కమిటీకి భూవివాదాల పరిశీలన, అక్రమ రిజిస్ట్రేషన్ల రద్దు వంటి కీలక అధికారాలు అప్పగించడం చూస్తుంటే ఈ యాక్ట్ ఆచరణలోకి వస్తున్నట్టేనన్న అభిప్రాయాలు బలంగా వినిపిస్తున్నాయి. మరి గతంలో వ్యతిరేకించిన వర్గాలు ఇప్పుడు మౌనంగా ఉండబోతున్నాయా? ప్రభుత్వం దీనిపై వివరణాత్మకంగా ముందుకు వెళ్తుందా చూడాల్సిందే.

ఎన్నికల ముందు ఒకలా.. ఇప్పుడు మరోలా



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో ప్రజల ఆస్తులకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. రాజకీయ ప్రభావానికి లోనయ్యే అధికార వర్గానికి భూ అధికారం అప్పగించడం ప్రజలకు నిష్ప్రయోజమే. మోడీ నిర్ణయాలకు మోకరిల్లుతున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను అన్నిటా మోసగిస్తున్నారు. కలెక్టర్ నేతృత్వంలో కమిటీకి అధికారం ఇవ్వడంపై సీఎం స్పందించాలి.

- గంటా శ్రీరామ్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు

ఇది పక్కా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలే..



జగన్ ప్రభుత్వంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ఎన్నికల ముందు నానా యాగీ చేసిన చంద్రబాబు రద్దు చేస్తున్నట్లు తొలి సంతకం కూడా చేశారు. ఇప్పుడు మళ్లీ అక్రమ భూ రిజిస్ట్రేషన్‌లను రద్దు చేసే అధికారం కలెక్టర్ కమిటీకి ఇవ్వడంపై ఆందోళన కలిగిస్తుంది. ఇది పక్కాగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అమలు లాగే కనిపిస్తోంది. మరి సివిల్ కోర్టులకు అధికారాలు ఉంటాయా? ఉండవా అన్నది ఇంకా స్పష్టత లేదు. న్యాయవాద వర్గాలు దీనిపై తప్పక పోరాటం చేయాల్సి ఉంది.

- ఆడారి స్వామి, న్యాయవాది, అనకాపల్లి

గుర్తు తెలియని మహిళ హత్య

బంజరి సమీపంలో పాక్షికంగా కాలిన మృతదేహం లభ్యం





పాక్షికంగా కాలిన వివాహిత మృతదేహం, కేసు వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌ఛార్జి డిఎస్‌పి మోహనరావు

ప్రజాశక్తి-సబ్బవరం

గుర్తు తెలియని మహిళ హత్యకు గురైంది. ఎక్కడో హత్య చేసి మండలంలోని ఆనందపురం-అనకాపల్లి 16 నెంబర్ జాతీయ రహదారిలో బాటజంగాల పాలెం పంచాయితీ పరిధి బంజరి సమీపంలో సిద్ధార్థ కోళ్ల ఫారానికి వెళ్లే మార్గంలో మట్టి రోడ్డుపై మృతదేహాన్ని దుండగలు తగలబెట్టారు. పాక్షికంగా కాలిన ఉన్న మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇన్‌ఛార్జి డిఎస్‌పి బి.మోహన్‌రావు స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఇన్‌ఛార్జి డిఎస్‌పి తెలిపిన వివరాలు ప్రకారం... ఈనెల 14న గురువారం ఉదయం 8 గంటల సమయంలో బాటజంగాలపాలెం గ్రామానికి చెందిన లైన్మెన్ ఆగ్గాల సతీష్, ఆ గ్రామస్తుడు కాపుశెట్టి వీరునాయుడు కరెంట్ లైన్ చెక్ చేయడానికి వెళ్ళగా బంజరి సమీపంలో సగం కాలి ఉన్న మహిళ మృతదేహాన్ని గుర్తించారు. వారు వెంటనే బాటజంగాలపాలెం సర్పంచ్ పడాల వెంకటరమణకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే సర్పంచ్ సంఘటన స్థలానికి చేరుకొని వారితో కలిసి మృతదేహాన్ని పరిశీలించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటనా స్థలానికి అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, అడిషనల్ ఎస్పీలు దేవప్రసాద్, మోహన్‌రావు, క్లూస్ టీం బృందం, డాగ్ స్క్వాడ్, రీజనల్ ఫోర్సెసిక్ సైన్స్ లేబరేటరీ నుండి ముగ్గురు అనలిస్టులు చేరుకొని పరిశీలించారు. నేరం జరిగిన తీరును పరిశీలన చేసి పలు శాంపిల్స్‌ను భద్రపరిచారు. మృతదేహం శరీరంపై పచ్చ నలుపు గులాబీ రంగు గల నైటీ, ఎరుపు రంగు బ్రా, ఎరుపు రంగు సున్ని, లేత గులాబీ రంగులో దుస్తులు ఉన్నాయి. మృతురాలి మెడలో రోల్డ్ గోల్డ్ నల్లపూసలు, చెవి దిద్దులు, ఎరుపు రంగు మట్టి గాజులు, రబ్బర్ బ్యాండ్, కాళ్లకు మట్టెలు ఉన్నట్లు గుర్తించారు. ఆమె వయస్సు 25 నుండి 30 మధ్య ఉంటుంది. మెడకు తవ్వాలు బిగించి చంపినట్లు గుర్తించారు. మంచం నవారు పట్టితో ఆమె శరీరానికి కాలు, చేతులు కట్టి తీసుకొచ్చి అక్కడ పడేసి పెట్రోలు లేదా పెట్రోల్ లాంటి ద్రవంతో కాల్చి వేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనపై రెండు పోలీసు టీమ్‌లు ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి డిఎస్‌పి తెలిపారు. మృత దేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి మార్చురీలో ఐస్ బాక్సులో నిబంధనల ప్రకారం మూడు రోజులు భద్రపరుస్తామని చెప్పారు. మూడు రోజుల తర్వాత మృత దేహానికి పోస్ట్‌మార్టం నిర్వహిస్తామని తెలిపారు. స్థానిక సీఐ జి.రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మీడియా సమావేశంలో సిఐ జి.రామచంద్రరావు, ఎస్సై టి.దివ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న కూటమి నాయకులు

పిఎసిఎస్ అధ్యక్షునిగా శ్రీను బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట పిఎసిఎస్ అధ్యక్షుడిగా దొండా శ్రీను గురువారం పిఎసిఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా ఒంటెద్దు సాంబమూర్తి, సాయం అయ్యన్న దొర బాధ్యతలు చేపట్టారు. పిఎసిఎస్ సీఈవో, కార్యాలయ సిబ్బంది నూతన కమిటీకి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తనకిచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. తమకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్‌రాజుకు, ప్రభుత్వ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన దాసు, సాయం శేషు, దొండా వెంకటరమణ, ఎంపీటీసీ యల్లపు జగ్గయమ్మ, సర్పంచ్‌లు మేరుగు కుమారి, మొల్లి శ్రీను, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పశు దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులకు పశుదాణా పంపిణీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లి, కొత్తపెంట, పెదనందిపల్లి, తారువా, కాశీపురం, వేచలం గ్రామాల్లో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రైతులకు పశు దాణా పంపిణీ చేశారు. ప్రభుత్వం 50 శాతం రాయితీపై ఈ దాణాను అందిస్తుందని పశువైద్యాధికారులు తెలిపారు. 134 బస్తాలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. దేవరాపల్లి పశు వైద్యశాల వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ రైతులకు దాణా బస్తాలు అందజేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గాంధీ నగరం డిఏవి పబ్లిక్ స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను గురువారం కన్నుల పండుగగా నిర్వహించారు. స్కూల్ హెచ్ఎం సి.మహదేవశాస్త్రి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది, పేరెంట్స్ సమక్షంలో పిల్లలు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. భారతీయ సంస్కృతి, పద్ధతులు పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే అలవాటు చేయాలని, అందుకోసమే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం తెలిపారు.

'అళ్వార్'లో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-పెందుర్తి : గోపాలపట్నం సమీపంలోని ఆర్ఆర్ వెంకటాపురంలో ఉన్న అళ్వార్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కృష్ణాష్టమి వేడుకలు గురువారం నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో వచ్చి అలరించారు. నాటికల ద్వారా శ్రీకృష్ణుడు వృత్తాంతాన్ని కళ్లకు కట్టినట్లు వివరించారు. ఉట్టికొట్టు కార్యక్రమాన్ని ఉల్లాసంగా నిర్వహించారు. డైరెక్టర్ హర్షలత, చిరంజీవి, క్యాంపస్ కో-ఆర్డినేటర్ భగవాన్, ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ విద్యార్థులను అభినందించారు.



అనకాపల్లి డిఏవి స్కూల్ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

అన్నదాత సుఖీభవ విజయోత్సవం



విజయోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకష్ణ ఆధ్వర్యంలో గురువారం అన్నదాత సుఖీభవ విజయోత్స రైతు ట్రాక్టర్ ర్యాలీ జోరు వానలో సైతం కొనసాగింది. కసింకోట, అనకాపల్లి మండలాల నుండి వందలాది ట్రాక్టర్లు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్డు మీదగా నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు సాగింది. ఈ సందర్భంగా కొణతాల మాట్లాడుతూ రైతుల శ్రేయస్సుకోరే ప్రభుత్వం తమదని చెప్పారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఏర్పాటుచేసిన అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయడం జరిగిందన్నారు. చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. కేంద్రం పీఎం కిసాన్ కింద ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి మొత్తం రూ. 20,000 ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, ఎరువుల ధరలు మరింత గుదిబండగా మారుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతన్నలకు పెట్టుబడి సాయం అందించే ఉద్దేశంతో ఈ పథకం తీసుకొచ్చానట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్నీ బాలాజీ, కసింకోట, అనకాపల్లి మండలాలు, అనకాపల్లి పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రైతులు కానరాని రైతు ర్యాలీ

అనకాపల్లి రూరల్ : అన్నదాత సుఖీభవ విజయోత్స రైతు ర్యాలీలో ఎక్కడా రైతులు కానరాలేదు. మచ్చుకైనా పంట పొలాల వాసన లేదు. రైతుల మనసులో మాటలైనా వినిపించాలి. కానీ వేదిక మీద మాత్రం కనిపించింది మైక్ కోసం, కెమెరా కోసం పోటీ పడుతున్న నాయకుల జాబితా మాత్రమే. అన్నదాత సుఖీభవ పథకం వల్ల రైతులకు మేలు జరిగిందని చాటి చెప్పేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం, చివరికి రైతుల కంటే రాజకీయ ఆశావహుల ప్రదర్శన వేదికగా మారిపోయిందంటే ఆశ్చర్యం లేదు.

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వేదిక మీద చోటా మోటా నాయకులు క్రమం తప్పకుండా "ఫోటో-ఫ్రేమ్"లో ఉండేందుకు చేసే పోటీ అసలు లక్ష్యాన్ని నీరుగార్చేసింది. మూడు పార్టీల కలయిక కాబట్టి తామే ప్రధానమైన వాళ్ళం అనే భావనతో, కొంతమంది చిన్న నాయకులు ఫ్లాష్ లైట్ల మధ్య తమనే హీరోలుగా మార్చుకునే ప్రయత్నం అన్ని కార్యక్రమాల్లాగే జరిగింది. వేదిక ముందు వరుసల్లో రైతులకు బదులు రాజకీయ పార్టీ బాటలు మాత్రమే కనిపించాయి. రైతుల సమస్యలపై చర్చ కంటే, ఎవరి ప్రసంగం ఎక్కువ చప్పట్లు కొట్టించిందన్నది ముఖ్యాంశమైంది. ప్రచార పిచ్చి ఇలాగే కొనసాగితే జెంటిల్మెన్‌గా పేరున్న కొణతాల సాదాసీదా నేతగానే మిగిలిపోతారన్న ఆవేదన వీరాభిమానుల్లో కనిపిస్తుంది.

స్వచ్ఛ సర్వేక్షణ్ అమలుపై పర్యవేక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి గ్రామ పంచాయతీలో స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ కార్యక్రమం అమలుపై అధికారులు పర్యవేక్షణలో చేపట్టారు. ప్రభుత్వ పాఠశాల రికార్డులు, టాయిలెట్ సౌకర్యాలు, అంగన్వాడీ సెంటర్ టాయిలెట్స్‌ను పరిశీలించారు. గ్రామ ప్రజలందరూ వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగిస్తున్నారా, డ్రైనేజీ వ్యవస్థను క్రమం తప్పకుండా శుభ్రం చేస్తున్నారా, వీధుల పరిశుభ్రతను కొనసాగిస్తున్నారా అనేదానిపై ఆరా తీసారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సంపద కేంద్రానికి తరలించడం, అక్కడ వర్మీ కంపోస్ట్ తయారీ పరిస్థితుల్ని పరిశీలించారు. ప్రతి ఇంటికీ తాగునీటి పైపులైన్లు కల్పించారా, అంటువ్యాధుల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నారా, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉన్నారా అనే అంశాలపై కూడా సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కామరాజు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ విపివి త్రినాథ్, ఎంఆర్సీడి పైడిరాజు, సచివాలయ సిబ్బంది, వెలుగు వివో ఉప్పు రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సూర్యఘర్ పథకంపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి-అచ్యుతాపురం : సూర్యఘర్ పథకంపై అచ్యుతాపురం ఏపీఐఐసీ కార్యాలయంలో గురువారం విద్యుత్ ఏడి, ఏఈలు, డ్వాక్రా అధికారులతో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య ఘర్ రూఫ్ టాప్ పథకంలో పదివేల గృహాలకు సోలార్ పవర్ అమర్చాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో నేటి వరకు ఎన్ని గృహాలకు సోలార్ పథకాలు లబ్ధిదారులను ఎంపిక చేశారని సంబంధిత అధికారులను అడిగారు. ప్రభుత్వ లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేయడానికి సంబంధిత అధికారులు శ్రద్ధ వహించాలని సూచించారు. ఎస్సీ ఎస్టీ బీసీలతోపాటు ఇతర వర్గాలకు సోలార్ రూఫ్ టాప్ పథకంలో ఎక్కువమంది లబ్ధి పొందేలా చూడాలని సూచించారు.

రోడ్డుపైకి ఏపుగా పెరిగిన కంచె మొక్కలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని కలపాక నుండి దలైపాలెం ఉప్పు గల్లీలు మీదుగా వాడచీపురుపల్లి వెళ్లే రహదారికి ఇరువైపులా కంచె మొక్కలు ఏపుగా పెరిగిపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. కంచె చెట్లు కొమ్మలు రోడ్డుపైకి వంగి రావడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు కళ్ళకు గుచ్చుకుంటున్నాయ. ప్రత్యేకంగా వాహనాలు ఒకదానిని ఒకటి తప్పుకునే సమయంలో రోడ్డు పక్కకు వెళ్లే స్థలం లేకపోవడంతో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. రహదారికి ఇరువైపులా కంచె మొక్కలను తక్షణమే తొలగించి, రహదారి విస్తరణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రయాణికులు ఆర్అండ్‌బి శాఖ అధికారులను కోరుతున్నారు.



కలపాక-వాడచీపురుపల్లి రోడ్డులో ఏపుగా పెరిగిన కంచె మొక్కలు

ఇంటింటా జాతీయ జెండా ఎగరాలి

• పలుచోట్ల ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



భీమిలి బీచ్‌లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి -యంత్రాంగం

నర్సీపట్నం టౌన్ : 79 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని వేములపూడి గ్రామంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు బొలెం శివ ఆధ్వర్యంలో ర్యాలీని జిల్లా ఉపాధ్యక్షులు శీరం రెడ్డి సూర్యనారాయణ జండా ఊపి ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే బొలెం ముత్యాలపాప ర్యాలీలో జాతీయ జెండాతో పాల్గొని, నినాదాలు చేస్తూ అందరినీ ఉత్సాహపరిచారు. పంచాయతీ సెక్రెటరీ బంగారు సత్యనారాయణ, విద్యార్థులు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

నక్కపల్లి : స్థానిక ఏపి రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపల్ యు ఉషారాణి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ జెండాను చేత పట్టుకుని ర్యాలీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురేయాలని పిలుపునిచ్చారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన గురువారం స్థానిక బీచ్ నుంచి గంటస్తంభం వరకు విద్యార్థులు, అధ్యాపకులు జాతీయ జెండాలతో హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.విష్ణుమూర్తి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జివిఎంసి మూడో వార్డు పరిధిలో హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. జోనల్ కమిషనర్ బమ్మి అయ్యప్ప నాయుడు, వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, శానిటరీ మేస్త్రి రేగాని రవి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నూకరాజు పాల్గొన్నారు.

సీతమ్మధార : సీతమ్మధార బాలయ్య శాస్త్రి లే-అవుట్‌లో హర్ ఘర్ తిరంగ ర్యాలీని శ్రీనవోదయ విద్యాసంస్థల విద్యార్థులు నిర్వహించారు. ఈ ర్యాలీకి ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ఉత్సాహంగా జాతీయ పతాకంతో యాత్రలో పాల్గొనడం ఆనందాన్ని కలిగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ నవోదయ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ బిశెట్టి రాము, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనకాపల్లి : ప్రజలలో దేశభక్తిని, జాతీయ భావాన్ని పెంపొందించేలా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని జాయింటు కలెక్టరు ఎమ్.జాహ్నవి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియం నుండి నాలుగురోడ్ల కూడలి వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఎస్‌పి తుహిన్ సిన్హా, డిఆర్‌ఒ వై.సత్యనారాయణరావు, ఆర్‌డిఒ షేక్ ఆయిషా, హౌసింగ్ పీడీ వై.శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా ఎక్సైజ్ అధికారి వి సుధీర్, డిఆర్‌డిఏ పీడీ కె.శచీదేవి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటరు జిల్లా కో ఆర్డినేటరు ఇ.నాగలక్ష్మి, డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, సర్వే సహాయ సంచాలకులు గోపాల కృష్ణ, అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, జెసి జాహ్నవి

కె.కోటపాడు : ప్రతి ఒక్క భారతీయుడు విధిగా జాతీయ జెండాను గౌరవించాలని మండలంలోని చౌడువాడ గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, పంచాయతీ ఈవో పి.సురేష్ బాబు అన్నారు. చౌడువాడ గ్రామంలో గురువారం హర్, ఘర్ తిరంగాలో భాగంగా 400 అడుగుల జాతీయ జెండాతో జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు, గ్రామ ప్రజలు, సచివాలయ, అంగన్వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, పాఠశాల ఉపాధ్యాయులు రమణ రాజు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు 100 మీటర్ల జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విక్టర్ పాల్, ఫిజికల్ డైరెక్టర్, పిఈటి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సారంగ్ నౌక సిద్ధం


సిద్ధమైన సారంగ్ నౌక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఇండియన్ కోస్ట్ గార్డ్ షిప్ సారంగ్‌ను కాంప్లెక్స్ లైఫ్ ఎక్స్‌టెన్షన్ రిఫిట్‌ను పూర్తి చేసి గురువారం ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు అప్పగించింది. హెచ్‌ఎస్‌ఎల్ 27 ఏళ్ల పాత వింటేజ్ నౌక అయిన సారంగ్‌ను షెడ్యూల్ కంటే మూడు రోజుల ముందుగానే సిద్ధం చేసింది. ఈ నౌక ఏడాది ఏప్రిల్ 19న రిఫిట్ కోసం హెచ్‌ఎస్‌ఎల్‌కు చేరుకున్న విషయం తెలిసిందే.

ఇల్లాలి ఆరోగ్యంతోనే కుటుంబం బాగు

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : ఇంటిలో గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని ప్రముఖ అంకాలజిస్టు, గైనకాలజిస్టు డాక్టర్ లీల అన్నారు. గురువారం పెదగుమ్ములూరు గ్రామంలో గ్రామపెద్దలు యేజర్ల వినోద్‌రాజు, నవీన్ రాజు సహాయ సహకారంలతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. త్రిదండి చినజీయర్ స్వామి వికాస తరంగిణి, మహిళా ఆరోగ్య వికాస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్ మాట్లాడుతూ మహిళల్లో వచ్చే గర్భాశయ, రొమ్ము కేన్సర్లపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలు గర్భాశయ ముఖద్వారాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యశిబిరంలో పాల్గొన్న మహిళలకు విఐఎ, పాప్సీమమ్, హెచ్ పి వి టెస్టులు నిర్వహించారు.కొలాప్స్ కోపి టెస్టు చేశారు. గర్భాశయ ముఖద్వార సమస్యలకు ఉచితంగా మందులు అందజేసి, అప్పటికీ నయం కాకపోతే, బైయాప్సీ టెస్టులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. 25ఏళ్ల దాటిన మహిళలు ఏటా రొమ్ము కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. సంవత్సరంలు దాటిన తర్వాత నుండి ప్రతి సంవత్సరం బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్త్రీల గర్భాశయ వ్యాధులు ముఖ్యంగా వంశపారంపర్యంగా,అరక్షిత శృంగారం, బాల్య వివాహాల వలన వచ్చే అవకాశముందన్నారు. ఈ సందర్భంగా వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వేంపాడు ఆయుర్వేద వైద్యులు డాక్టర్ రఘు, వికాస తరంగిణి సేవాదళం సభ్యులు సుభాష్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆర్థికసాయం చెక్కులను ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు గురువారం అందజేశారు. మండలంలో గర్నికం గ్రామానికి చెందిన పల్లా లక్ష్మికి రూ.70వేలు, రావికమతం గ్రామానికి చెందిన వియ్యపు జగన్నాథంకు రూ.79,324, గుడ్డిప గ్రామానికి చెందిన గుమ్మాల భానుప్రశాంత్‌కు రూ.34,180, తట్టబంద గ్రామానికి చెందిన నమ్మి తేజస్వికి రూ.పదివేలు, గుంట్ల లక్ష్మికి రూ.53,827, మోటూరి మణికి రూ.89,595 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో వైద్యం అందక ఎవ్వరూ అల్లాడిపోకూడదని వారికి ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉచిత వైద్యం అందజేస్తున్నామన్నారు. అందులో కవర్ కాని రోగాలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం అందజేస్తున్నామన్నారు.కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావు, మాజీ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు రాజాన కొండ నాయుడు, రావికమతం సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపిటిసి వేపాడ నాగేశ్వరావు, గల్లా నానిబాబు పాల్గొన్నారు.

నారుమడి యాజమాన్యంపై అవగాహన

ప్రజాశక్తి -నక్కపల్లి : నారుమడిలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. గురువారం మండలంలో కాగిత గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటించి, వరి నారుమడులను పరిశీలించారు. ప్రస్తుతానికి నారుమడులలో ఎలాంటి చీడపీడలు లేకపోయినప్పటికీ మూడు, నాలుగు రోజులుగా వాతావరణం మార్పులతో పొడ తెగులు ఆశించే అవకాశం ఉందన్నారు. ఎక్కడైనా వరినారు ఎండుతున్నట్లు అనిపించినా హెక్సాకొనజోల్ మందుపిచికారి చేయాలని సూచించారు. నారుమళ్ళు నీటి ముంపునకు గురైతే, నీటిని తొలగించి, రెండు కిలోలు యూరియా, ఒక కేజీ పొటాష్ ఎరువులను ఐదు సెంట్ల నారుమడిలో చల్లాలని సూచించారు. వ్యవసాయ పథకాలు అందాలంటే ప్రతి రైతు ఈక్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఇఒ శ్రీనివాస్, సాయికుమారి, ఆర్ఎస్‌కె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిఎసిఎస్ పాలకమండలి ప్రమాణ స్వీకారం



చైర్మన్, డైరెక్టర్లను అభినందిస్తున్న కూటమి నేతలు

ప్రజాశక్తి -పాయకరావుపేట : పాయకరావుపేట పిఎసిఎస్ నూతన చైర్మన్‌గా మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దేవవరపు రాజుబాబు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని మంగవరం రోడ్డులో పిఎసిఎస్ కార్యాలయంలో డైరెక్టర్లుగా కూలి నానాజీ, కట్టా నూకరత్నంతో కలసి ప్రమాణ స్వీకారం చేసిన రాజుబాబు కొత్త చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎద్ద సంఖ్యలో విచ్చేసి చైర్మన్ రాజుబాబు, డైరెక్టర్లు నానాజీ, నూకరత్నంలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పూల బొకేలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సిఇఒ పినపాత్రుని నాగభూషణం, సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కాంట్రాక్టర్ల ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. చెస్, క్యారమ్స్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయగా కాంట్రాక్టర్లు అందరూ పాల్గొని ఉత్సాహంగా గడిపారు. చెస్‌లో విజేతగా వి.రామకృష్ణ, ద్వితీయ స్థానంలో కాల సుధాకర్ నిలిచారు. క్యారమ్ బోర్డులో విజేతగా యలమంచిలి రమేష్, ద్వితీయ స్థానంలో మద్దాల రమేష్ నిలిచారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో విజేతగా వి.రామకృష్ణ, ద్వితీయ స్థానంలో చక్రవర్తి, క్రికెట్‌లో విజేతగా ఎస్‌వి.రామయ్య జట్టు, ద్వితీయ స్థానంలో గాజువాక జట్టు నిలిచాయి. ఈ ఆటవిడుపు కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పివివి. నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, ట్రెజరర్ సిరికి శ్రీనివాసరావు, ఎఆర్ కన్‌స్ట్రక్షన్స్ అప్పలరాజు, కె.నారాయణరావు, జి.సింహాచలం పాల్గొన్నారు.


ఆటల పోటీల్లో పాల్గొన్న కాంట్రాక్టర్లు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి- రావికమతం:మండలంలో కొట్నపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ఆత్మ పథక సంచాలకులు ఆశా దేవి మాట్లాడుతూ ప్రకృతి విధానంలో సాగుతో ఆరోగ్యకరమైన పంట దిగుబడులతోపాటు నేల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. నర్సీపట్నం ఎడిఎ టి.శ్రీదేవి మాట్లాడుతూ రసాయన ఎరువులు, క్రిమి సంహారకాలు వాడకుండా సాగు భవిష్యత్తు తరాల ఆరోగ్యం, నేల పరిరక్షణకు మేలన్నారు. ఏఒ రమేష్ బాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించే పంటలకు మంచి ధర, డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ వర్మ, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఇలాగైతే ప్రజా సమస్యల పరిష్కారం ఎలా?

ప్రజాశక్తి- కోటవురట్ల : గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి విడుదల చేసే 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందని, ఇలాగైతే గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారంతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించేదెలాగని మాజీ సర్పంచ్, వైసిపి మండల అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేశారు, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేసే కార్మికులకు వేతనాలు, మౌలిక సౌకర్యాలు ఎలా కల్పించాలని ప్రశ్నించారు. గ్రామాల్లో వీధి దీపాలు, దోమల పిచికారి మందులు, తాగునీటి సమస్యల పరిష్కారం, పారిశుధ్య పరిరక్షణకు కనీసం బ్లీచింగ్ చల్లడం వంటి పనులు ఎలా చేయాలని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు తక్షణమే పంచాయతీలకు రావాల్సిన నిధులను జమ చేయాలని కోరారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలో గొడిచెర్ల గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపిడిఒ డి సీతారామరాజు పర్యవేక్షించారు. తడి పొడి చెత్తను ఇంటింటా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. షాప్ యజ మానులు తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాపించే అవకాశం ఉందని, నీటి నిలువలు లేకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కిరణ్, శ్రీను పాల్గొన్నారు

దళిత రైతుల మౌనదీక్ష



వినూత్న రీతిలో నిరసన చేస్తున్న జి.కోడూరు దళితులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : జి.కోడూరులో అక్రమ క్వారీలను రద్దుచేయాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని 23రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ గురువారం మౌనదీక్ష చేపట్టారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రిలే దీక్షలో భాగంగా చేతులతో ముక్కు నోరు మూసుకొని మౌనం పాటించి, వినూత్న రీతిలో నిరసన చేపట్టారు.. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ జి.కోడూరు దళిత రైతుల సమస్యలపై ప్రభుత్వం, అధికారుల వైఖరి దుర్మార్గమన్నారు. 23 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా కనీసం అటువైపు చూడకపోవడం, పట్టించుకోకపోవడ దళితుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం చిన్నచూపునకు నిదర్శనమని మండిపడ్డారు. అక్రమ మైనింగ్‌ను రద్దుచేసి, దళితుల భూములను పరిరక్షించి, వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అప్పారావు ,పెంటయ్య, లక్ష్మి, జి.కోడూరు దళిత రైతులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు
పెద్దగుమ్మలూరు విద్యార్థుల ఎంపిక



విద్యార్థినులతో హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -యస్ రాయవరం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన వాలీబాల్ పోటీలు అండర్ 15 బాలికల విభాగంలో ఉమ్మడి విశాఖపట్నంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో మండలంలో పెదగుమ్మలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థినులు మంచి ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయిని సుధా మాధురితెలిపారు. తమ పాఠశాల నుంచి కనిగిరి హరిణి, పోలిశెట్టి పావని రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికవ్వడం హర్షనీయమన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈనెల 25న అమరావతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో వీరు పాల్గొంటారన్నార. ప్రతిభ చూపిన విద్యార్థులతోపాటు వారికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు నిర్మలను పలువురు అభినందించారు

ఉప ఎన్నికల్లో విజయంతో సంబరాలు

ప్రజాశక్తి-గొలుగొండ : జెడ్‌పిటిసి స్థానాలకు రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో రెండుచోట్ల టిడిపి విజయంపై ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పులివెందులలో జెడ్‌పిటిసి స్థానంలో టిడిపి అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి రికార్డుస్థాయి మెజార్టీతో గెలవడం, అక్కడ విపక్ష వైసిపి అభ్యర్థికి డిపాజిట్ కోల్పోవడంతో చీడిగుమ్మల గ్రామంలో టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. గ్రామ నాయకులు స్వీట్లు పంచి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ విజయం వైసిపికి గట్టి గుణపాఠం అని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కామిరెడ్డి గోవిందు తదితరులు పాల్గొన్నారు.



మిఠాయిలు తినిపిస్తూ సంబరాల్లో టిడిపి నేతలు

క్వారీలతో ప్రజల కష్టాలు పట్టవా?

- సిపిఎం ఆధ్వర్యంలో మైన్స్ ఎడి కార్యాలయం వద్ద నిరసన



ఆందోళన చేస్తున్న క్వారీ బాధిత గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : నల్లరాయి. గ్రానైట్ క్వారీల దెబ్బకు చోడవరం నియోజకవర్గం రోలుగుంట, రావికమతం మండలాల ప్రభావిత గ్రామాల్లో పర్యావరణంతోపాటు రోడ్లు ధ్వంసమౌతున్నాయని గురువారం ఆయా గ్రామాల ప్రజలు సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘాలఆధ్వర్యంలో మైన్స్ ఎడి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు గోవింద మాట్లాడుతూ నల్లరాయి క్వారీలతో రాజన్నపేట గ్రామంలో ఇల్లు ధ్వంసమౌతున్నాయన్నారు. రోలుగుంట మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కొవ్వూరు వెళ్లే రోడ్డులో 20 టన్నుల మించి అధిక లోడుతో వాహనాలు వెళ్లకూడదనే నిబంధన ఉన్నప్పటికీ, 60 టన్నులు పైబడి బరువుతో నల్లరాయితో భారీ లారీలు రాకపోకలు సాగిస్తున్నాయన్నారు. దీంతో రోలుగుంట కేంద్రం నుంచి కొవ్వూరు, నాయుడుపాలెం, అంట్లపాలెం గ్రామానికి వెళ్లే రక్షిత మంచినీటిపథకం పైపులైన్లు పగిలిపోయి నీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడుతున్నా పట్టించుకునే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

క్వారీల కాలుష్యంతో ప్రభావిత గ్రామాల్లో రక్షిత మంచినీటికి మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తామన్న హామీ ఏళ్ల గడుస్తున్నా అమలుకు నోచుకోలేదన్నారు. బాధిత గ్రామాల ప్రజలు ఫ్లోరైడ్ సమస్యతో కిడ్నీ,ఇతరత్రా వ్యాధులతో బాధపడు తున్నారని, దీనిపై విజిలెన్స్ ఎండ్ అండ్ ఫోర్స్ మెంట్ సమగ్ర దర్యాప్తు చేసి తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రావికమతం మండలంలో టి.అజ్జాపురం నుంచి పాత కొట్నాబిల్లికి అంబులెన్స్ కూడా వెళ్లలేని దుస్థితి ఉందని, పాతకొట్నాబిల్లి నుంచి పంచాయతీ కేంద్రం టి ఆర్జాపురం రావాలంటే 12 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన ఉందన్నారు. నల్లరాయి క్వారీ, గ్రానైట్ ప్రభావిత గ్రామాల్లో తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వాసు, కె. వెంకటరావు పాల్గొన్నారు

ఆటో కార్మికులను ఆదుకోవాలి



సిఐటియు ఆధ్వర్యాన వినతిపత్రం ఇస్తున్న ఆటో కార్మికులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్త్రీశక్తి పథకం అమలుతో మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్ సౌకర్యం కల్పించడమ హర్షనీయమైనా, ఇదే సమయంలో జీవనోపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు. గురువారం నర్సీపట్నం పాత బస్సుస్టాండ్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు రాని పరిస్థితుల్లో స్వయం ఉపాధికి వడ్డీలకు అప్పులు చేసి ఆటోలు కొనుక్కుని వాటిని తిప్పడం ద్వారా జీవనోపాధి పొందుతున్న ఆటో కార్మికులకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోయే పరిస్థితి ఉందన్నారు ఒకవైపు కుటుంబపోషణ, మరోవైపు రుణవాయిదాల భారం నుంచి ఆటోకార్మికులను గట్టెక్కించాలని, వారికి వాహన మిత్ర ద్వారా ఆటో లైసెన్స్ పొందిన ప్రతి కార్మికుడికి ఏటా రూ. 25వేలు భృతి, ఇన్సూరెన్స్, ఇతర సర్వీసులు కల్పించాలని, ఇప్పటివరకు వారిపై ఉన్న కేసులు, జరిమానాలు రద్దుచేయాలని, ఉబర్, వాలా వంటి సర్వీసులు ప్రభుత్వమే నిర్వహించాలని, డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని, ఆటో కొనుగోలుకు రూ. ఐదు లక్షలు వడ్డీ లేని రుణం ఇవ్వాలని కోరారు కార్యక్రమంలో ఆటో కార్మికులకు రాజు, అనిల్, శ్రీను, సత్తిబాబు పాల్గొన్నారు.

భారీ చెట్టు కూలి వ్యక్తి దుర్మరణం

- రన్నింగ్‌లో ఉన్న బైక్‌పై కూలిన మహా వృక్షం



శ్రీనివాసరావుపై పడిన భారీ వృక్షం

ప్రజాశక్తి- పాయకరావుపేట : మండలంలోని పెదరాంభద్రపురం వద్ద ఆర్‌అండ్‌బి రోడ్డుపై బైక్‌పై వెళుతున్న డెక్కన్ కెమికల్ కంపెనీ ఉద్యోగి తోట శ్రీనివాసరావు (33)పై గురువారం ఉదయం భారీ చెట్టు పడటంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఘటనకు సంబంధించి పాయకరావుపేట సిఐ గంట్లాన అప్పన్న తెలిపిన వివరాలివి.

తూర్పుగోదావరి జిల్లా, కడియం మండలం, దూళ్లపేట గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు (33) రాజవరం డెక్కన్ కెమికల్ కంపెనీలో ఇన్స్టుమెంటేషన్ టెక్నీషియన్ (కాంట్రాక్టు ఉద్యోగి)గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ మాదిరిగానే గురువారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు డెక్కన్ కెమికల్ కంపెనీకి స్నేహితుడుతో కలసి బైక్‌పై వెళు తుండగా, పెదరాంభద్రపురం వద్ద రోడ్డుపై వెళుతున్న బైక్‌పై అకస్మాత్తుగా భారీ నిద్రగన్నేరు చెట్టు కూలింది. ఈ దుర్ఘటనలో బైక్ నడుపుతోన్న శ్రీనివాసరావు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందగా, బైక్ వెనుక కూర్చున్న అతడి స్నేహితుడు వెంటనే బైక్ పైనుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. రెండు రోజులుగా కుండపోతగా కురుస్తోన్న వర్షాలకు ఈ భారీవృక్షం హఠాత్తుగా కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షాన్ని పోలీసు, రెవెన్యూ సిబ్బంది తొలగించి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. శ్రీనివాసరావు మతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ అప్పన్న తెలిపారు.



సూక్ష్మ కళాకారుని దేశభక్తి



చెక్కతో రూపొందించిన అశోక చక్రం, ఇండియా మ్యాప్

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని చినదొడ్డుగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు, కార్పెంటర్ దార్ల రవి తన నైపుణ్యంతో దేశభక్తిని చాటుకున్నాడు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని చెక్కతో అశోక చక్రం చెక్కి, ఇండియా మ్యాప్, జాతీయ జెండాను తన సూక్ష్మకళతో ఆవిష్కరించి దేశభక్తిని చాటాడు.

స్వాతంత్ర్య సంబరాలు జరుపుకునేదెలా?

నిధుల లేమితో గ్రామ పంచాయతీలు వెలవెల

ప్రజాశక్తి -నర్సీపట్నం/కోటవురట్ల : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో గతేడాది పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకునేందుకు ఒక్కో గ్రామపంచాయతీకి రూ.25వేలు చొప్పున నిధులు మంజూరు చేశారు ఆ నిధులతో గతేడాది గ్రామాలలో స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు, అయితే ఈ ఏడాది స్వాతంత్ర దినోత్సవాన్ని ఎలా జరుపుకునేదంటూ గ్రామీణ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు, 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు నేటికీ జమకాలేదు. దీంతో పారిశుధ్యం ఓవైపు పడకేసింది కనీసం పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉంది. ఈ తరుణంలో స్వతంత్ర దినోత్సవాన్ని జరుపుకునేది ఎలాగో చెప్పాలని పలు గ్రామాల ప్రజలతో పాటు సచివాలయ అధికారులు ప్రశ్నిస్తున్నారు.


వైభవంగా ఆలయాల ప్రారంభం

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలో ఎన్ నరసాపురంలో గురువారం గోపాలకృష్ణ నూతన ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి నూతన ఆలయాన్ని ప్రారంభించి, గోపాలకృష్ణ విగ్రహాన్ని ప్రతిష్టించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

రావికమతం: మండలంలో దొండపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గాదేవి ఆలయ ప్రారంభోత్సవం గురువారం ఘనంగా జరిగింది. చోడవరం ఎమ్మెల్యే ఎస్ఎన్ఎస్ రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ,నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజుతో పాటు, పలువురు మండల స్థాయి నాయకులు దుర్గాదేవిని దర్శించుకున్నారు కార్యక్రమంలో ఎంపిటిసి కొప్పాక లక్ష్మీ నాయుడు, కోమటి శంకరరావు, కోట నేలవేణి గోవిందరావు, వెదురుపర్తి వెంకటాచారి పాల్గొన్నారు.



ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
HAPPY Independence Day 15 AUGUST
45వ వార్షికోత్సవ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
విశాఖపట్నం శుక్రవారం 15-08-2025 8 పేజీలు



స్ఫూర్తి కెరటం.. విశాఖ

◆ స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర ◆ నేడు ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పోరాటాలు

ప్రజాశక్తి - విశాఖపట్నం



విశాఖ.. నిత్య స్ఫూర్తి కెరటం. నాడూ, నేడూ ఈ ప్రాంతం గొప్ప ఉద్యమ వేదిక. స్వాతంత్ర్యోద్యమంలో ఉమ్మడి విశాఖ నిప్పు కణికై మండింది. ఎన్నో పోరాటాలకు నెలవైంది. ఇప్పటికీ పోరుగడ్డగా జన హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల వేళ ఓసారి చరిత్రపుటను తిరగేస్తే ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ... కొత్త సవాళ్లను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్న భారతదేశం, అందునా మన విశాఖ కళ్ల ముందు కదలాడతాయి. బ్రిటీష్ వారిపై తొలి రోజుల్లోనే తిరుగుబాటు చేసిన ఘన చరిత్ర విశాఖ ప్రజలది.

ఇప్పుడు విశాఖ పేరు వినగానే ఇక్కడున్న ప్రభుత్వ రంగ సంస్థలైన స్టీల్‌ప్లాంట్, పోర్టు, హెచ్‌పిసిఎల్, భెల్, రక్షణ రంగం, రైల్వే, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) వంటి కీలక పరిశ్రమలు గుర్తుకురాక మానవు. ఇవన్నీ నాటి స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి పతాకగా వెలుగొందుతున్నాయనడంలో ఎలాంటి సందేహమూ లేదు. నేడవి కేంద్ర బిజెపి పాలకుల తీరుతో ఒక్కొక్కటిగా అంతర్ధాన మైపోయే పరిస్థితులు దాపురిస్తున్నాయి. వీటి ఏర్పాటుకు నాడు, ప్రభుత్వ రంగ పరిరక్షణకు నేడు సాగుతున్న ఉద్యమాలకు స్వాతంత్రోద్యమ చరిత్రే వారసత్వంగా దర్శనమిస్తోంది. విశాఖకు స్వాతంత్ర్య ఉద్యమానికి ఎంతో దగ్గర సంబంధం, విడదీయరాని బంధం ఉందనడంలో ఎలాంటి సందేహమూ లేదు..

నాడు విశాఖలో సాగిన ఉప్పు సత్యాగ్రహం, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి నేటికీ కొనసాగుతుండటానికి ఈ ప్రాంత ప్రజల పట్టుదల... పోరాటాల పట్ల నిబద్ధతే కారణం. స్వాతంత్ర్య ఉద్యమ మూలాలు మన విశాఖతో పెనవేసుకుని ఉండడం నిజంగా గర్వకారణమనే చెప్పాలి. దేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమేందుకు ఉద్యమ పతాకను ఎగర వేయగా... ఆ తర్వాత స్వతంత్ర్య గడ్డపైనా ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి, తీర ప్రాంతంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సాధన కోసం ఉద్యమాలు సాగాయి. ఒక్కో ఉద్యమం దేనికదే విడివిడిగా సాగినా దేశ, రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా అవి ముందుకు సాగాయి. దేశంలో స్వాతంత్ర్యం సాధ్యమయ్యాక సాధించుకున్న, జాతీయం కాబడిన పలు ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్రంగా విశాఖపట్నం వెలుగొందుతూ వస్తోంది.

స్వాతంత్ర్యోద్యమం అంటేనే త్యాగాలమయం. పైగా దీర్ఘకాల పోరాటం.. మన దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో విశాఖ జిల్లా ప్రత్యేక పాత్రనే పోషించింది. జిల్లా నుంచి ఎంతో మంది యువకులు ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. 1928లో ఖద్దరు ప్రచారం, 1930లో ఉప్పు సత్యాగ్రహం, 1932లో శాసనోల్లంఘన, 1942లో క్విట్ ఇండియా కార్యక్రమాలు విశాఖలోనూ సాగాయి. జాతీయ నాయకత్వం ఇచ్చిన ప్రతి పిలుపులోనూ ఈ జిల్లా వాసులు పాల్గొనడం విశేషం. ఎవిఎన్, ఆంధ్రా మెడికల్ కళాశాలల్లో అనేకమంది (మిగతా 7లో..)







భారత నావికాదళంలోకి అధునాతన యుద్ధనౌకలు



ఉదయగిరి (ఎఫ్ 35) ఫ్రంట్ లైన్ స్టీల్త్ ఫ్రిగేట్

ఎన్నో ప్రత్యేకతలు ఐఎన్ఎస్ ఉదయగిరి, హిమగిరి సొంతం

26న ఒకేసారి జలప్రవేశం : జాతికి అంకితం : దేశంలో ఇదే తొలిసారి



అధునాతన సౌకర్యాలున్న హిమగిరి (ఎఫ్ 34) యుద్ధనౌక

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారత నావికాదళం సత్తాను, పటిష్టతను ప్రపంచానికి చాటిచెప్పేందుకు సన్నద్ధమౌతోంది.ఉదయగిరి (ఎఫ్ 35), హిమగిరి (ఎఫ్ 34) అనే రెండు అధునాతన ఫ్రంట్‌లైన్ స్టీల్త్ ఫ్రిగేట్‌లను ఒకేసారి ఈనెల 26న ప్రారంభించేందుకు ఇండియన్ నేవీ సన్నాహాలు చేస్తోంది. విశాఖపట్నంలో రెండు ప్రతిష్టాత్మక భారతీయ షిప్‌యార్డ్‌ల నుంచి రెండు ప్రధాన ఉపరితల పోరాటనౌకలను ఒకేసారి ప్రారంభించడం ఇదే మొదటిసారి. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ నిర్మిస్తున్న 'పి17ఎ' నౌకలలో హిమగిరి నౌక మొదటిది కాగా, 'పి17ఎ' స్టెల్త్ ఫ్రిగేట్స్‌లో రెండవ నౌక ఉదయగిరిని ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించింది. ఈ రెండు నౌకలు ఒకేసారి ప్రారంభించడం రక్షణ రంగంలో మేక్ ఇన్ ఇండియా ఆత్మనిర్భర్ భారత్ చొరవల విజయాన్ని ప్రదర్శిస్తుందని అధికారులు తెలిపారు. నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ నౌకగా ఉదయగిరి గుర్తింపు పొందింది. పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ ఫలితంగా రెండు నౌకల నిర్మాణంలో 200 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఇ సంస్థలు పనిచేసాయి. దాదాపు నాలుగు వేల మంది ప్రత్యక్ష ఉద్యోగులు, పది వేల పైచిలుకు పరోక్ష ఉద్యోగులు నేవీ నౌక నిర్మాణంలో భాగస్వాములయ్యారు.ఇప్పటికే ఈ నౌకలు కఠినమైన సముద్ర పరీక్షలు ఫ్రిగేట్‌ల హల్, యంత్రాలు, అగ్నిమాపక, నష్ట నియంత్రణ, నావిగేషన్, కమ్యూనికేషన్ వ్యవస్థలను అనుమతులు పొంది కార్యాచరణ విస్తరణకు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. అంతకుముందు ఈ ఏడాదిలోనే డిస్ట్రాయర్ ఐఎస్ఎస్ సూరత్, ఫ్రిగేట్ ఐఎస్ఎస్ నీలగిరి, జలాంతర్గామి ఐఎస్ఎస్ వాగ్షేర్, ఎఎస్‌డబ్ల్యు షాలో వాటర్ క్రాఫ్ట్ ఐఎస్ఎస్ అర్నాలా, డైవింగ్ సపోర్ట్ వెసెల్ ఐఎస్ఎస్ నిస్టార్‌లను పూర్తి స్వదేశీయంగా భారత నావికాదళం నిర్మించి ప్రారంభించిందని చడం అధికారులు తెలిపారు.

రెండు నౌకల ప్రత్యేకతలివే

ఈనెల 26న ఇండియన్ నేవీ జాతికి అంకితం చేయనున్న ఉదయగిరి, హిమగిరి నౌకలు మునుపటి డిజైన్ల కంటే తరతరాలుగా ముందంజలో ఉన్నాయి.. దాదాపు 6,700 టన్నుల బరువును కలిగి ఉన్న 'పి17ఎ' ఫ్రిగేట్‌లు, వాటి ముందున్న శివాలిక్, క్లాస్ ఫ్రిగేట్‌ల కంటే దాదాపు ఐదు శాతం పెద్దవి. అంతేకాకుండా తక్కువ రాడార్ క్రాస్ సెక్షన్‌తో సొగసైన రూపాన్ని కలిగి ఉండి, కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్రొపల్షన్ ప్లాంట్‌ల ద్వారా శక్తిని పొందుతాయి, ఇవి డీజిల్ ఇంజిన్‌లు, గ్యాస్ టర్బైన్‌లను ఉపయోగిస్తాయి, ఇవి సులభంగా నియంత్రించదగిన పిచ్ ప్రొపెల్లర్‌లను నడుపుతాయి ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా నిర్వహించబడతాయి. ఆయుధ సూట్‌లో సూపర్‌సోనిక్ సర్ఫేస్-టు-సర్ఫేస్ క్షిపణులు, మీడియం రేంజ్ సర్ఫేస్-టు-ఎయిర్ క్షిపణులు, 76 ఎంఎం ఎంఆర్ గన్, 30 ఎంఎం, 127 ఎంఎం క్లోజ్‌ఇన్ వెపన్ సిస్టమ్స్,యాంటీ-సబ్‌మెరైన్,అండర్ వాటర్ వెపన్ సిస్టమ్‌ల కలయికతో ఈ అధునాతన వార్ షిప్‌లు రూపొందిబంచబడ్డాయి.



పోస్టల్ స్కీమ్స్‌తో అధిక ప్రయోజనాలు

ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందిస్తున్న తపాలా శాఖ



ప్రజాశక్తి-అనకాపల్లి

తపాల శాఖ ద్వారా ప్రజలు పెట్టే సేవింగ్స్ ఖాతాల డిపాజిట్లపై ఆకర్షణీయమైన వడ్డీలను అందిస్తున్నాయి. వడ్డీ రేట్లను ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ వడ్డీలు వివిధ స్కీములపై నాలుగు శాతం నుంచి 8.2 శాతం గా అందిస్తున్నాయి. వీటిని పరిశీలిస్తే...

★ **సీనియర్ సిటిజెన్ సేవింగ్ స్కీమ్**లో లక్ష రూపాయలు డిపాజిట్ చేస్తే ఏడాదికి 8.2శాతం చొప్పున మూడు నెలలకు 2050 రూపాయల చొప్పున ఐదు సంవత్సరాలకు లక్ష 41 వేల రూపాయలు అందిస్తోంది.

★ **సుకన్య సమృద్ధి యోజన** స్కీమ్ ఆడపిల్లలకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశ్యంతో రూపొందించిన ప్రభుత్వ పొదుపు పథకం. 10 సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ వయస్సు ఉన్న ఆడపిల్లల తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఈ పథకం కింద ఖాతాను తెరవవచ్చు. ఈ పథకం అనేక పన్ను ప్రయోజనాలతో పాటు అధిక వడ్డీ రేటును కలిగి ఉంటుంది. నెలకు వెయ్యి రూపాయలు చొప్పున డిపాజిట్‌పై 15 సంవత్సరాలు చెల్లిస్తే 21వ సంవత్సరం తర్వాత రూ.3,74,612 వడ్డీ కలిపి రూ.5,54,612 రూపాయలు ఇవ్వడం జరుగుతుంది.

★ **నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్‌పై** లక్ష రూపాయల డిపాజిట్‌కు 7.7శాతం వడ్డీపై ఐదు సంవత్సరాలకు రూ.44,903 వడ్డీ కలిపి రూ.1,44, 903 రూపాయలు అందిస్తారు.

★ **కిసాన్ వికాస పత్ర** 7.5శాతం వడ్డీతో 9 సంవత్సరాల ఏడు నెలలకు లక్ష డిపాజిట్‌పై లక్ష వడ్డీ చెల్లించి ఇస్తున్నారు.

★ **ఐదు సంవత్సరాల టర్మ్ డిపాజిట్‌పై** 7.5శాతం వడ్డీ లక్ష డిపాజిట్‌పై రూ.38,568 రూపాయల వడ్డీ చెల్లిస్తుంది.

★ **మంత్లీ ఇన్కమ్ స్కీంలో** 7.4శాతం వడ్డీపై ఐదు సంవత్సరాలకు రూ.37 వేలు చెల్లిస్తోంది.

★ **పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్** 7.1శాతం వడ్డీపై 15 సంవత్సరాలకు లక్ష 80వేల రూపాయలపై రూ.1,35,572 వడ్డీ చెల్లిస్తుంది.

★ **రికరింగ్ డిపాజిట్‌లపై** ఐదు సంవత్సరాలకు 6.7శాతం సేవింగ్స్ ఖాతాలపై నాలుగు శాతం, ఏడాది టైం డిపాజిట్‌పై 6.9శాతం రెండేళ్ల టైం డిపాజిట్‌పై ఏడు శాతం, మూడేళ్ల టైం డిపాజిట్‌పై 7.1 శాతం వడ్డీ చెల్లిస్తుంది.

★ **ఏడాది టైం డిపాజిట్లపై** లక్షకు రూ.7,080, రెండేళ్ల డిపాజిట్లుపై రూ.7,185, మూడేళ్ల టైం డిపాజిట్‌పై రూ.7,291 వడ్డీ చెల్లిస్తోంది.

అయితే ఈ వడ్డీ రేట్లు ప్రతి మూడు నెలలకు ప్రభుత్వ నిబంధనల మేరకు మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది.



భారత రాజ్యాంగం : ముఖ్య లక్షణాలు



కె.ఎస్.లక్ష్మణరావు
మాజీ ఎంఎల్‌సి

భారత రాజ్యాంగం ఎంతో ప్రాధాన్యతగలది. స్వాతంత్ర్య భారతదేశ చరిత్రలో నవంబర్ 26 అత్యంత ప్రాధాన్యత కలిగిన రోజు. మరీ ముఖ్యంగా ఆధునిక, లౌకిక, ప్రజాస్వామ్య, భారతదేశ నిర్మాణంలో ఈ రోజుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కారణం 1949 నవంబర్ 26వ తేదీన భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది 1947 ఆగస్టు 15. ఆ రోజుతో తెల్లవాడి పాలన, అంటే సామ్రాజ్యవాదుల పాలన అంతమై, అధికారం భారత పాలక వర్గాల చేతుల్లోకి బదలాయించబడింది. ఈ నూతన పాలక వర్గాలు రాజ్యాంగ సభ నూతన భారత రాజ్యాంగాన్ని రూపొందించింది. రాజ్యాంగం ఏర్పడిన తర్వాత చర్చ మొత్తం సహజంగానే రాజ్యాంగం చుట్టే తిరుగుతుంది. అనేకసార్లు పాలకవర్గాలు తమ ప్రయోజనాల దృష్ట్యా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూనే ఉన్నాయి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగసభలో ముసాయిదాను ప్రవేశపెడుతూ "రాజ్యాంగం ఎంత ఉన్నతమైనదైనా దాన్ని అమలు చేసేవారు ఉన్నతులు కాకపోతే అది ఒక చెడ్డ రాజ్యాంగంగానే నిరూపించబడుతుంది" అని చేసిన హెచ్చరిక ఆధారంగానే భారత రాజ్యాంగం అమలు చరిత్రని విశ్లేషించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అసలు భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాల గురించి ప్రత్యేక కథనం.

భారత రాజ్యాంగ పరిషత్ భారత రాజ్యాంగాన్ని రూపొందించింది. 1949 నవంబర్ 26న ఆమోదం పొందిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ నిర్మాణంలో రాజ్యాంగ నిర్మాతలు ఆధునిక ప్రపంచంలోని తాత్విక పునాదులను అనుసరించారు. ఉదారవాదం, ప్రజాస్వామ్య సామ్యవాదం, లౌకికవాదం, గాంధీవాదం మొదలైన మూల సూత్రాలను రాజ్యాంగంలో పొందుపర్చారు. సమన్యాయ పాలన, ప్రాథమిక స్వేచ్ఛలు ప్రజలకు ఉండాలని భావించారు. ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం జరగాలని ప్రతిపాదించారు. వీటన్నింటి ఆధారంగా రాజ్యాంగ మౌలిక లక్షణాలు రూపొందాయి.

లిఖితంగా.. విపులంగా..

ప్రపంచంలో భారత రాజ్యాంగం అతి పెద్ద లిఖిత రాజ్యాంగం. రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రచనకు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు తీసుకుంది. భారతదేశంలోని భిన్నత్వం, అన్ని తరగతుల ప్రయోజనాలు రక్షించాలనే దృక్పథం రాజ్యాంగంలో కనిపిస్తుంది. దళితులు, గిరిజనులు, ఇతర వెనుకబడిన తరగతుల ప్రయోజనాల పరిరక్షణకు రాజ్యాంగంలో అనేక నిబంధనలను పొందుపర్చారు. అనేక విధులను నిర్వహించడానికి రాజ్యాంగ సంస్థలను ఏర్పాటు చేశారు. రాజ్యాంగం రచించినప్పుడు రాజ్యాంగంలో 395 నిబంధనలు, 22 భాగాలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. గత ఏడు దశాబ్దాలుగా జరిగిన మార్పుల్లో ప్రస్తుతం రాజ్యాంగంలో 468 నిబంధనలు, 25 భాగాలు, 12 షెడ్యూళ్లు కలవు. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 9వ షెడ్యూల్, 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పదో షెడ్యూల్, 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 11వ షెడ్యూల్, 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా 12వ షెడ్యూల్ చేర్చారు. వీటన్నింటి వల్ల భారత రాజ్యాంగం పరిమాణంలో పెద్దదిగా రూపొందింది.

మౌలిక స్వరూపం..

భారత రాజ్యాంగంలో మౌలిక స్వరూపం గురించి పేర్కొనలేదు. కానీ 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీం కోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని వివరించి, దాన్ని కాపాడుకోవాలని చెప్పింది. వివిధ కేసుల్లో జస్టిస్ సిక్రి, జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హెగ్డే మొదలైనవారి తీర్పులను పరిశీలిస్తే రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలు తెలుస్తాయి. రాజ్యాంగ ఆధిక్యత, ప్రజాస్వామ్య, సమాఖ్య విధానం, లౌకిక విధానం, సమన్యాయం, సార్వభౌమాధికారం మొదలైనవాటిని మౌలిక లక్షణాలుగా పేర్కొన్నారు. మినర్వామిల్స్ కేస్ (1980), వామన్రావ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1981) కేసుల్లో కూడా సుప్రీం కోర్టు రాజ్యాంగ మౌలిక స్వరూప ప్రాధాన్యతను తెలిపింది.

పీఠిక..

భారత రాజ్యాంగ లక్ష్యాలను పీఠికలో పొందుపర్చారు. పీఠికలోని 'భారతదేశ ప్రజలమైన మేము' అను వాక్యాన్ని ఐక్యరాజ్య సమితి రాజ్యాంగమైన చాప్టర్ నుండి గ్రహించారు. రాజ్యాంగం రచించినప్పుడు పీఠిక 'సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా' పేర్కొన్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా సామ్యవాద, లౌకిక, సమగ్రత అనే పదాలను నూతనంగా చేర్చారు. దీనితో పీఠిక 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యముగా' రూపొందింది. ప్రజలందరికీ ఆర్థిక, సామాజిక, రాజకీయ న్యాయం చేకూరాలని పీఠిక చెప్పింది. ప్రజలకు స్వేచ్ఛ కల్పించడానికి రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను చేర్చారు. ప్రజలకు సమానత్వం కల్పించడానికి రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుపర్చారు. భారతదేశంలో రాజ్యాధినేత ఎన్నుకోబడడంతో దేశం గణతంత్ర రాజ్యంగా రూపొందింది. పౌరులకు మత స్వేచ్ఛను కల్పించడంతో లౌకిక రాజ్యంగా ఉంది. భారతదేశంలో అధికారానికి మూలాధారం ప్రజలు అని పీఠిక తెలిపింది.

పార్లమెంటరీ ప్రభుత్వం..

భారత రాజ్యాంగం దేశంలో పార్లమెంటరీ తరహా ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టింది. ప్రధానమంత్రి నాయకత్వాన గల మంత్రి మండలి నిజమైన అధికారాలను కలిగి ఉంటుంది. రాజ్యాధినేత అయిన రాష్ట్రపతి నామమాత్ర అధికారాలను కలిగి ఉంటారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ పార్లమెంటరీ తరహా ప్రభుత్వం కొనసాగుతుంది. సమిష్టి బాధ్యత, కార్యనిర్వాహక వర్గం, శాసన నిర్మాణ శాఖకు బాధ్యత వహించడం పార్లమెంటరీ విధానం యొక్క ముఖ్య లక్షణాలు. అయితే బ్రిటిష్ తరహా పార్లమెంటరీ ప్రభుత్వాన్ని భారతదేశం స్వీకరించలేదు. బ్రిటన్లో ఇప్పటికీ వారసత్వ రాజరికం కొనసాగుతోంది. కానీ భారతదేశం తనకుతాను గణతంత్ర రాజ్యంగాన్ని ప్రకటించుకుంది.


స్వతంత్ర న్యాయవ్యవస్థ..

భారత రాజ్యాంగం దేశంలో స్వతంత్ర న్యాయవ్యవస్థను ఏర్పాటు చేసింది. న్యాయవ్యవస్థ ఏకీకృత న్యాయ వ్యవస్థగా ఉంటుంది. రాజ్యాంగంలో చెప్పనప్పటికీ న్యాయవ్యవస్థ న్యాయ సమీక్ష అధికారాన్ని కలిగి ఉంది. గత నాలుగు దశాబ్దాలుగా న్యాయ వ్యవస్థ క్రియాశీలత కొనసాగుతోంది. ప్రస్తుతం సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తితో సహా 31 మంది న్యాయమూర్తులు కొనసాగుతున్నారు. దేశంలో వివిధ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు 24 హైకోర్టులు ఏర్పడి పనిచేస్తున్నాయి. న్యాయమూర్తుల నియామకానికి కొలీజియం వ్యవస్థ ఏర్పడింది. ఇటీవల జాతీయ న్యాయమూర్తుల నియామక కమిషన్‌ను 99వ రాజ్యాంగ సవరణ ప్రకారం ఏర్పాటు చేసినప్పటికీ సుప్రీం కోర్టు ఆ సవరణను కొట్టివేసింది. దేశంలో పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడడంలో న్యాయవ్యవస్థ క్రియాశీలక పాత్ర వహిస్తోంది. ఇటీవల కాలంలో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం ప్రాధాన్యత పొందింది.

సమాఖ్య ఏక కేంద్ర లక్షణాలు..

రాజ్యాంగ నిర్మాతలు భారతదేశాన్ని సమాఖ్య, ఏకకేంద్ర లక్షణాల సమ్మేళనంగా రూపొందించారు. సమాఖ్య లక్షణాలైన లిఖిత రాజ్యాంగం, అధికార విభజన, ద్విసభా విధానం, స్వతంత్ర న్యాయశాఖ మొదలైనవి భారత రాజ్యాంగంలో ఉన్నప్పటికీ ఇది పూర్తి సమాఖ్య కాదు. సమాఖ్యను అధిగమించే ఏకకేంద్ర లక్షణాలు బలంగా ఉన్నాయి. అందువల్లే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారతదేశాన్ని ఏకకేంద్ర స్ఫూర్తితో పనిచేస్తున్న సమాఖ్య రాజ్యంగా వర్ణించాడు. ప్రముఖ రాజ్యాంగ నిపుణుడు


మిగతా 5లో...



భారత రాజ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీ







నిత్య స్ఫూర్తి .. బీచ్ రోడ్డులో విగ్రహాలు

79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో పేద ప్రజల అభ్యున్నతికి అంకితమై సేవలందిస్తూ, అదే విధంగా ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న పత్రికా సంపాదకులు, ప్రతినిధులు, విలేకర్లు, సిబ్బందికి 45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

GREATER VISAKHA MUNICIPAL CORPORATION CONTRACTORS ASSOCIATION
GVMCCA

జివియంసి కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్
విశాఖపట్నం


అల్లూరి సీతారామరాజు విగ్రహం

రాతి రూపంలో ఉన్న రత్నాలు. మన జాతి చిహ్నాలు విగ్రహాలు. విగ్రహం ఉనికిని జ్ఞప్తికి తెస్తుంది.స్మరణకు అవకాశం ఇస్తుంది. కొందరి విగ్రహాలు మనలో నిరంతరం స్ఫూర్తి నింపుతూ ఉంటాయి, ముందుకు నడిపిస్తూ ఉంటాయి. వారి తెగువ, ధైర్య సాహసాలు మనలో పౌరుషాన్ని రగిలిస్తాయి. మరికొందరి విగ్రహాలు వారు ఎదిగిన తీరును స్మరణకు తెస్తాయి. అలాంటివి ఎందరో ప్రముఖుల విగ్రహాలు విశాఖ రామకృష్ణ బీచ్‌లో కొలువుదీరి ఉన్నాయి. బీచ్‌రోడ్డుకే అలంకరణగా, ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తున్నాయి.

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్


వంగపండు ప్రసాదరావు విగ్రహం

భారతదేశంలో అందమైన నగరాలలో విశాఖపట్నం మొదటి శ్రేణిలో ఉంటుంది. విశాఖనగరంలో ఎన్నో చూడదగిన ప్రదేశాలున్నాయి.అందుకే ఎక్కడెక్కడినుంచో సందర్శకులు సాగర నగర తిలకించడానికి వస్తుంటారు. కనువిందు చేసే అందాలను తిలకించడంతో పాటు రామకృష్ణ బీచ్‌లో సాగర కెరటాలను చూసి ఆనందిస్తుంటారు. బీచ్‌రోడ్డులో నడకను ఆస్వాదిస్తారు. అదే క్రమంలోఅక్కడ ప్రతిష్ఠించబడిన ప్రముఖుల విగ్రహాలను చూసి తన్మయం చెందడం ఒకదాని వెంట మరొకటి చకచకా జరిగిపోతుంటాయి.

బీచ్ రోడ్డులో 60 విగ్రహాలు

తెలుగు జాతి కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపచేసిన ఎంతో మంది ప్రముఖులతో పాటు స్వాతంత్ర్య సమరయోధులు, సామాజికవేత్తలు, కవులు, రచయితలు, గాయకులు, రాష్ట్ర ప్రముఖుల విగ్రహాలు బీచ్ రోడ్డులో కొలువుదీరి ఉన్నాయి. రామకృష్ణబీచ్ వద్ద విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు విగ్రహం బీచ్ రోడ్డులోని విగ్రహాల వైపు మార్గం చూపుతుండగా, మరోవైపు డచ్ హౌస్ అపార్ట్మెంట్స్ వద్ద మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం చేయెత్తి పలకరిస్తుంటుంది. ఈ రెండు విగ్రహాలు బీచ్ రోడ్డు మధ్యలో ఉండగా, మిగతా విగ్రహాలు సముద్రం వైపు చూస్తూ బీచ్ రోడ్డులో నగరం వైపు వరుసగా కొలువుదీరి ఉన్నాయి.

స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నేతల విగ్రహాలు

స్వాతంత్ర్య సమర యోధుడు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, దేశ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్, 1932-37లో మద్రాసు ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆర్ఎస్ఆర్‌కె రంగారావు (బొబ్బిలి రాజా), రాష్ట్రపతిగా ఉన్నత పదవి చేపట్టిన కార్మికోద్యమ నాయకుడు వరాహగిరి వెంకటగిరి, మూడవ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తదితరుల విగ్రహాలు తాము ఉన్నత పదవులకు ఎదిగిన తీరును తెలుసుకోమంటుంటాయి.

ఆజాద్ హిందు ఫౌజ్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రబోస్, ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నినాదంతో యువతలో స్వాతంత్ర్య ఉద్యమకాంక్షను రగిలించిన విప్లవవీరుడు భగత్ సింగ్, ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు, బొబ్బిలిపులి తాండ్ర పాపారాయుడు, నాస్తిక వాది, సంఘ సంస్కర్త, తమిళనాడులో ఆత్మగౌరవ ఉద్యమం ద్రావిడ ఉద్యమ నిర్మాత పెరియార్ ఇవి రామస్వామి తదితరుల విగ్రహాలు వారి ధైర్య సాహసాలు, త్యాగాలు, ఆదర్శాలు మనకు నిరంతరం గుర్తుకు తెస్తూ ఉంటాయి. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, బౌద్ధ మత వ్యవస్థాపకుడు గౌతమ బుద్ధుడు, జైన మత వ్యవస్థాపకుడు వర్ధమాన మహావీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమనాయకుడు ఆచార్య ఎస్.జి రంగా, మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య, కొవ్వూరి గంగరెడ్డి .రైలు ఇంజన్‌ను ఒంటి చేత్తో ఆపిన కోడి రామమూర్తి, రాచరిక వ్యవస్థలో పుట్టినా సామ్యవాదం కోసం కృషి చేసిన పివిజి రాజు తదితరుల విగ్రహాలు తమను గురించి తెలుసుకోమంటాయి.

స్త్రీమూర్తి ఒక్కరే

బీచ్‌రోడ్‌లో కొలువైన మహనీయుల విగ్రహాలలో స్త్రీమూర్తి ఒక్కరే కనిపిస్తారు ఆమె ఆంధ్ర మహిళాసభ స్థాపకురాలు, సంఘసేవకురాలు దుర్గాబాయ్ దేశముఖ్ కావడం విశేషం.

సాహిత్య,సంగీతానికి పెద్ద పీట

బీచ్ రోడ్డులో కొలువైన విగ్రహాలను పరిశీలిస్తే సాహిత్యానికి, సంగీతానికి పెద్ద పీట వేసినట్లు కనిపిస్తుంది. సాహితీ సమరాంగణ చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు, మహాప్రస్థానంతో మరో ప్రపంచానికి దారిచూపిన శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ), నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం, పురిపండా అప్పలస్వామి, కొప్పరపు కవులు (కొప్పరపు వెంకట సుబ్బరాయకవి, కొప్పరపు వెంకటరమణ), కవి విశ్వనాథ సత్యనారాయణ, కవికోకిల గుర్రం జాషువా, డాక్టర్ సి.నారాయణరెడ్డి, తిరుపతి వెంకట కవులు (దివాకర్ల తిరుపతి శాస్త్రి, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి), అడవి బాపిరాజు, పదకవితా పితామహుడు అన్నమయ్య, ఆరుద్ర (భాగవతుల సదాశివశాస్త్రి), గేయరచయిత జాలాది రాజారావు, రావిశాస్త్రిగా పిలవబడే రాచకొండ విశ్వనాథ శాస్త్రి విగ్రహాలు పర్యాటకులను పలకరిస్తూ వారి సాహిత్య సౌరభాలను గుర్తు చేస్తుంటాయి. మధుర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు, ప్రముఖ సంగీత విద్యాంసుడు నేదునూరి కృష్ణమూర్తి, వయోలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామినాయుడు, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు విగ్రహాలు తమ గురించి తెలుసుకోమంటాయి.


దుర్గాభాయి దేశ్‌ముఖ్ విగ్రహం

అల్లూరి సీతారామరాజు స్టైలే వేరు

బీచ్ రోడ్‌లోని అన్ని విగ్రహాల కంటే పార్క్ హోటల్ జంక్షన్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు. విగ్రహం భిన్నంగా ఉంటుంది. అన్ని విగ్రహాలు ఉరకలెత్తే అలల కెరటాలను వీక్షిస్తూ ఉంటే, అల్లూరి సీతారామరాజు విగ్రహం విశాఖ నగర వాసులను చైతన్య పరుస్తున్నట్లుగా నగరానికి అభిముఖంగా ఉండడం విశేషం .అంతేకాకుండా ప్రముఖ సినీ,నటుడు అల్లురామలింగయ్య, విగ్రహంతో పాటు,సాగర కన్యల విగ్రహాలు మనకు బీచ్ రోడ్డులో కనిపిస్తాయి. ఉత్తరాంధ్ర వాగ్గేయకారుడు, జానపద కవి, తన ఆట, పాట ద్వారా జనం గొంతుకైన వంగపండు ప్రసాదరావు విగ్రహాన్ని బీచ్ రోడ్డులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.

మరికొందరి విగ్రహాలు ఏర్పాటు చేయాలి

ఆంధ్రప్రదేశ్‌ను అన్నపూర్ణగా మార్చి, విశాఖ నగర నిర్మాణానికి పునాది రాళ్లు వేసిన సర్ ఆర్థర్ కాటన్, తెలుగు భాషకు ఎనలేని సేవ చేసిన సిపి బ్రౌన్, గురజాడ అప్పారావు, తెన్నేటి విశ్వనాథం, ఆంధ్రులను హాస్య తరంగాలలో ముంచెత్తి, విశాఖ నగర అభివృద్ధిని ఏయేటికాయేడు తన సినిమాలలో చిత్రీకరించిన జంధ్యాల వంటి మహనీయుల విగ్రహాలు కూడా బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.

79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

ప్రజాశక్తి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో
పేద ప్రజల అభ్యున్నతికి అంకితమై సేవలందిస్తూ,
అదే విధంగా ప్రజాశక్తి పత్రిక అభివృద్ధికి
తోడ్పాటు అందిస్తున్న పత్రికా సంపాదకులు,
ప్రతినిధులు, విలేకర్లు, సిబ్బందికి
45వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

- శ్రేయోభిలాషి
ఆనందపురం

CHF

భారత రాజ్యాంగం : ముఖ్య లక్షణాలు

(3వ పేజీ తరువాయి..) కె.సి.వేర్ భారతదేశాన్ని 'అర్ధ సమాఖ్య' అని వర్ణించాడు. ఏకకేంద్ర లక్షణాలైన ఒకే పౌరసత్వం, ఏకీకృత న్యాయవ్యవస్థ, అఖిల భారత సర్వీసుల పాత్ర, కేంద్ర ఆధిక్యత మొదలైనవి కూడా రాజ్యాంగంలో ఉన్నాయి.

ప్రాథమిక హక్కులు..

రాజ్యాంగం మూడో భాగంలో 12 నుండి 35 వరకు గల నిబంధనల్లో ప్రాథమిక హక్కులను పొందుపర్చారు. భారత పౌరులకు స్వేచ్ఛను కల్పించడానికి ఈ హక్కులు దోహదపడతాయి. సుప్రీం కోర్టు 32వ నిబంధనల ద్వారా, హైకోర్టు 226వ నిబంధన ద్వారా పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటానికి ఐదు రకాల రిట్లు జారీ చేస్తాయి. ఆస్తి హక్కు వివాదం కావడంతో 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల నుండి తొలగించారు. ప్రస్తుతం ఆస్తి హక్కు ఒక చట్టబద్ధమైన హక్కు మాత్రమే. 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21-ఎ నిబంధన చేర్చి, ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా పొందుపర్చారు. అత్యవసర పరిస్థితి విధించిన సమయంలో ప్రాథమిక హక్కులు తాత్కాలికంగా సస్పెండ్ అవుతాయి.

ప్రాథమిక విధులు..

రాజ్యాంగ రచనా సమయంలో ప్రాథమిక విధులు రాజ్యాంగంలో లేవు. స్వర్ణసింగ్ కమిటీ సిఫార్సుల ఆధారంగా 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 10 ప్రాథమిక విధులను రాజ్యాంగం 4-ఎ భాగంలో, 51-ఎ నిబంధనలో చేర్చారు. తర్వాత 86వ రాజ్యాంగ సవరణ ద్వారా మరొక ప్రాథమిక విధిని జత చేశారు. ఇప్పుడు రాజ్యాంగంలో 11 ప్రాథమిక విధులున్నాయి. రాజ్యాంగాన్ని, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించడం, హింసను విడనాడడం, ప్రభుత్వ ఆస్తులను కాపాడడం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలు ప్రాథమిక విధుల్లో ఉన్నాయి. భారత పౌరుల్లో బాధ్యతాయుత ప్రవర్తనను పెంపొందించే ఆశయంతో ప్రాథమిక విధులను భారత రాజ్యాంగంలో చేర్చారు.

ఆదేశిక సూత్రాలు..

రాజ్యాంగం నాలుగవ భాగంలో 36 నుండి 51 వరకు గల నిబంధనల్లో ఆదేశిక సూత్రాలను పొందుపర్చారు. వీటిని ఐర్లండ్ రాజ్యాంగం నుండి గ్రహించారు. ఆదేశిక సూత్రాలు భారతదేశాన్ని ఒక సంక్షేమ రాజ్యంగా రూపొందించడానికి తోడ్పడతాయి. భారత ప్రజల ఆర్థిక, సామాజిక, జీవన ప్రమాణాలు పెంపొందించడానికి ఆదేశిక సూత్రాలను అమలు చేయాలని రాజ్యాంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. వీటికి న్యాయస్థానాల సంరక్షణ ఉండదు. సంపద పంపిణీ, సమాన పనికి సమాన వేతనం, కార్మికులకు సౌకర్యాలు మొదలైన అనేక అంశాలను ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చారు. అధికారంలోకి వచ్చిన రాజకీయ పార్టీలు, తమ రాజకీయ సిద్ధాంతాలతో నిమిత్తం లేకుండా ఆదేశిక సూత్రాలు అమలు చేయాల్సి ఉంటుంది.

సార్వజనీన వయోజన ఓటు హక్కు..

భారత రాజ్యాంగం పౌరులందరికీ సార్వజనీన ఓటు హక్కును ప్రసాదించింది. రాజ్యాంగ రచనా సమయంలో 21 సంవత్సరాలు నిండిన స్త్రీ, పురుషులందరికీ కుల, మత, వర్గ, లింగ, జాతి భేదాలు లేకుండా ఓటు హక్కు సార్వత్రికంగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ప్రతిపాదించారు. అయితే 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుండి 18 ఏళ్లకు తగ్గించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ విజయం సాధించడంలో ఓటు హక్కు ముఖ్యపాత్ర పోషించింది. గత 18వ సాధారణ ఎన్నికల్లో భారత ప్రజలు తమకుగల ఓటు హక్కును విజయవంతంగా వినియోగించుకున్నారు. 16వ సాధారణ ఎన్నికల్లో 33 కోట్ల మంది ప్రజలు ఓటు హక్కును కలిగి ఉండడం ప్రజాస్వాయ్య చరిత్రలోనే ఒక అపూర్వమైన విషయం. రాజ్యాంగ నిర్మాతలు ప్రజలందరికీ ఓటు హక్కు ఇవ్వడం ద్వారా ప్రజా సార్వభౌమాధికారం కొనసాగుతుందని విశ్వసించారు.

దృఢ, అదృఢ రాజ్యాంగం..

భారత రాజ్యాంగం దృఢ, అదృఢ రాజ్యాంగ లక్షణాలను కలిగి ఉంది. రాజ్యాంగంలో 18వ భాగంలో 368వ నిబంధనల ద్వారా రాజ్యాంగ సవరణ జరుగుతుంది. కొన్ని అంశాలను సవరించానికి అమెరికా వలె దృఢమైన పద్ధతి అనుసరిస్తారు. ఉదాహరణకు రాష్ట్రపతి, సుప్రీంకోర్టు, హైకోర్టు, కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు వంటి అంశాలను సవరించడానికి దృఢమైన పద్ధతితో సవరణ చేస్తారు. కొన్ని అంశాలను బ్రిటన్ వలె అదృఢమైన పద్ధతిలో సవరిస్తారు. రాష్ట్రాల ఏర్పాటు, రాష్ట్రాల పేర్లు మార్పు, దళితులు, గిరిజనుల పాలనకు సంబంధించిన అంశాలు అదృఢమైన పద్ధతిలో సవరిస్తారు. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు మొదలైన వాటిని సవరించడానికి దృఢ, అదృఢ పద్ధతిని అనుసరిస్తారు.

స్థానిక సంస్థలు..

రాజకీయ వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధి సాధ్యమని మహాత్మాగాంధీతో సహా అనేక మంది అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ రచనా సమయంలో స్థానిక సంస్థల గురించి కేవలం ఆదేశిక సూత్రాల్లో మాత్రమే పేర్కొన్నారు. బల్వంతరారు మెహతా కమిటీ, అశోక్ మెహతా కమిటీ మొదలైన వాటి సిఫార్సుల ద్వారా దేశంలో పంచాయతీ రాజ్ సంస్థలను ఏర్పాటు చేశారు. 1992లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ సంస్థలకు, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా మున్సిపల్ సంస్థలకు రాజ్యాంగ హోదా కల్పించారు. రాజ్యాంగంలో 11వ షెడ్యూల్ ద్వారా గ్రామ పంచాయతీలకు 29 అంశాలపై, 12వ షెడ్యూల్ ద్వారా మున్సిపల్ సంస్థలకు 18 అంశాలపై అధికారాలు కల్పించారు.

అణచివేతకు గురైన వర్గాలు


భారత సమాజంలో చారిత్రకంగా అణచివేతకు గురైన షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనకబడిన తరగతుల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో అనేక రక్షణలు, రిజర్వేషన్లు కల్పించారు. రాజ్యాంగం 16వ భాగంలో ఈ వర్గాల కోసం కొన్ని ప్రత్యేక నిబంధనలు చేర్చారు.

రాజ్యాంగం 5, 6 షెడ్యూళ్లలో గిరిజనుల కోసం, వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక నిబంధనలు చేర్చారు. మండల కమిషన్ నివేదిక అమలులో భాగంగా వెనకబడిన తరగతులకు జాతీయ స్థాయిలో 21 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఈ వర్గాల రక్షణ కోసం జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్, జాతీయ బిసి కమిషన్, జాతీయ మహిళా కమిషన్, జాతీయ మైనార్టీ కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్ మొదలైన వాటిని ఏర్పాటు చేశారు. వీటిల్లో కొన్ని కమిషన్లకు రాజ్యాంగ పరమైన హోదా కల్పించారు.





మువ్వన్నెల పతాక రూపకర్త పింగళి




ప్రజాశక్తి - విశాఖపట్నం : బ్రిటీషర్లను దేశం విడిచి పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించడం ఇష్టం లేని పింగళి వెంకయ్య, భారతదేశానికి ఒక జెండా ఉండాలంటూ సంకల్పించారు. శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ మూడు రంగులతో జెండాను రూపకల్పన చేశారు. 1921 మార్చి 31, ఏప్రిల్ 1న బెజవాడ, గాంధీనగర్‌లో కాంగ్రెస్ మహాసభల్లో గాంధీజీ సమక్షంలో ఆమోదింపజేశారు. ఈ పతాకానికి మధ్యలో మొదట రాట్నం గుర్తు ఉన్నప్పటికీ, తర్వాత ధర్మానికి గుర్తుగా అశోకచక్రం ఏర్పాటుతో భారత జాతీయ జెండా దేశ కీర్తిని స్ఫూర్తిని సగర్వంగా రెపరెపలాడిస్తోంది.

మువ్వన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య 1878 ఆగస్టు 2వ తేదీన దివి తాలూకా భట్లపెనుమర్రు గ్రామంలో జన్మించారు. బాల్యం, విద్యాభ్యాసం అక్కడే కొనసాగింది. 12ఏళ్లకే సెకండరీ విద్య పూర్తిచేసిన పింగళి, యుద్ధంలో చేరాలనే అభిలాషతో 19ఏళ్ల ప్రాయంలోనే ముంబై వెళ్ళి సైన్యంలో చేరి ఆఫ్రికాకు వెళ్లారు. అక్కడ గాంధీజీని కలవటం, స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులై, ఇండియాకు తిరిగొచ్చారు. అప్పటికే మద్రాసులో ప్లేగు వ్యాధి ప్రబలడంతో దేశ ప్రజలను ఆ మహమ్మారి నుంచి కాపాడాలన్న తపనతో వ్యాధి నివారణ అధికారిగా పనిచేశారు. 1904లో రష్యాపై జపాన్ గెలిచిందన్న వార్త విని వెంకయ్యలోని జిజ్ఞాస మేల్కొంది. ఇది ఎలా సంభవం, పెద్ద దేశాన్ని ఇంత చిన్నదేశం ఎలా జయించింది అనే తపనతో జపాన్ భాష నేర్చుకుని అనర్గళంగా మాట్లాడారు. జపాన్ వెంకయ్య అని పేరు పెట్టారు ప్రజలు. జపనీష్ భాష నేర్పిన గురువుకు మన భాషను నేర్పి గురువు రుణం తీర్చుకున్నారట వెంకయ్య. దీన్నిబట్టి వెంకయ్య పట్టుదల ఎంత దృఢమైనదో యువత గుర్తుంచుకోవాలి.

దేశభక్తిగల వెంకయ్య 1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభల్లో పాల్గొని నాటి సభాధ్యక్షులైన దాదాబాయి నౌరోజి మన్ననలు పొంది నిర్ణయ సభ సభ్యునిగా గుర్తింపు పొందారు. వ్యవసాయంపై ఆసక్తితో పరిశోధనలు చేసి వ్యవసాయశాస్త్రం అనే గ్రంథాన్ని ప్రజలకు అందించారు. వారి మేథా సంపత్తి నుంచి ఎంతైనా నేర్చుకోవాల్సివుంది. అందుకే ఆయనను రాజకీయ ద్రష్టగా అభివర్ణించారు పెద్దలు.

1906లో కోల్‌కతా కాంగ్రెస్ సభల్లో ఇంగ్లీషు వారిని పొమ్మంటూనే వారి జెండాను ఉపయోగించటం నచ్చని వెంకయ్య, మనకంటూ ఒక జెండా కావాలనే తపనతో భారత జాతీయ పతాకం అనే గ్రంథాన్ని 1916లో అందించారు. అప్పుడు వారిని జెండా వెంకయ్యగా పిలిచే వారు. ఇలా చెప్పుకుంటూ పోతే వెంకయ్య జీవిత విశేషాలు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటాయి.

1921 మార్చి 31, ఏప్రిల్ 1న బెజవాడలోని గాంధీనగర్‌లో కాంగ్రెస్ మహాసభల్లో శాంతి సౌభాగ్యాలకు చిహ్నంగా మూడు రంగులతో వెంకయ్య రూపొందించిన జెండాను గాంధీజీ సమక్షంలో ఏకగ్రీవంగా కరతాళ ధ్వనుల మధ్య ఆమోదించారు. జెండా మధ్యలో మొదట రాట్నం గుర్తు ఉన్నా, తర్వాత పెద్దలు సూచన మేరకు ధర్మానికి గుర్తుగా అశోకచక్రంతో మన జాతీయ జెండా కీర్తి అనే ఆకాశంలో విహరిస్తూ భారతదేశం మనది అనే స్ఫూర్తిని గర్వంగా చాటుతూ రెపరెపలాడుతోంది.



స్వాతంత్ర్యోద్యమంలో విశాఖ

ప్రజాశక్తి - విశాఖపట్నం

స్వాతంత్ర్యోద్యమంలో ఉమ్మడి విశాఖ జిల్లా నేతలు కీలకపాత్ర పోషించారు. తెల్లవాడిపై తొలిపోరాటం, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా ఉద్యమాల్లో నేతలు పాల్గొన్నారు. ఎందరో నేతలు బ్రిటిష్ పోలీసుల చేతుల్లో లాఠీదెబ్బలు తిన్నారు. అరెస్టయ్యారు. జైలుశిక్షలు అనుభవించారు. ఎవిఎన్, ఆంధ్రా మెడికల్ కళాశాలల విద్యార్థులు అనేక మంది చదువుకు స్వస్తి చెప్పి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టులూ కీలకపాత్ర పోషించారు. విశాఖ, అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి ప్రాంతాల ప్రజలు పెద్దఎత్తున పోరాటాలు నడిపారు.

స్వాతంత్ర్య చరిత్ర పుటల్లో పద్మనాభం యుద్ధం


తెల్లవాడిపై తొలిపోరాటం జరిగిన పద్మనాభం యుద్ధం చరిత్ర పుటల్లో నిలిచిపోయింది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వలస పాలనతో దేశంలోని సహజ వనరులు దోపిడీకి గురయ్యాయి. అప్పట్లో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల దోపిడీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అనేకచోట్ల పలు రూపాల్లో పోరాటాలు సాగాయి. విశాఖ జిల్లాలోని పద్మనాభం యుద్ధం కూడా అందులో భాగమే. ఇది ఒక సంస్థానానికి, బ్రిటిష్ వారికి మధ్య జరిగిన యుద్ధమే కావచ్చు. కానీ, బ్రిటీష్ సామ్రాజ్యవాదుల దోపిడీ విధానానికి వ్యతిరేకంగా జరిగిన యుద్ధం. విజయనగరానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న పద్మనాభం (విశాఖ జిల్లా)లో ఈ యుద్ధం జరిగింది. అందువల్లనే పద్మనాభం యుద్ధంగా ప్రసిద్ధి చెందింది. యుద్ధంలో ఆంగ్లేయుల ఆధునిక ఆయుధాలకు, రెండో విజయరామరాజు సాధారణ ఆయుధాలు కొరగాకుండా పోయాయి. యుద్ధంలో రెండో విజయరామరాజుతోపాటు 309 మంది వీర మరణం పొందగా, బ్రిటిష్ సైనికులు 13మంది మృతి చెందారు.

బ్రిటీషర్లపై మన్యవాసుల గెరిల్లా పోరాటం

అడవిపై బ్రిటీష్ పాలకులు తీసుకొచ్చిన నిరంకుశ చట్టాలను గిరిజనులు వ్యతిరేకించారు. 1845లో గొలుగొండ ఏజెన్సీ ప్రజలు ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ శిస్తులు చెల్లింపునకు నిరాకరించారు. ప్రభుత్వ సైన్యాలను, పోలీసులను తమ గెరిల్లా పోరాటం ద్వారా మూడేళ్లపాటు ప్రతిఘటించారు. సిపాయిల తిరుగుబాటు జరిగిన 1857లో గొలుగొండ ఏజెన్సీ ప్రజలు కూడా తిరుగుబాటు జరిపారు. 1879లో ఏజెన్సీ అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా రంప తిరుగుబాటు జరిగింది. తిరుగుబాటుకు నాయకత్వం వహించిన వీరయ్యదొరను బ్రిటీష్ పోలీసులు కాల్చి చంపారు. 1858, 1861ల్లో సాగిన రైతు తిరుగుబాట్లు, 1879లో జరిగిన రంప పితూరీ విశాఖ మన్యాన్ని కదిలించింది. 1922 ఫిబ్రవరిలో సవరల పోరాటం జరిగింది. అడవిలో గడ్డిని తెచ్చుకోవటానికి బ్రిటీష్ పాలకులు అడ్డంకులు కల్పించడంతో సవరలు తిరుగుబాటు చేశారు.

అల్లూరి పోరాటం చారిత్రాత్మకం

అల్లూరి సీతారామరాజు నడిపిన పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ప్రత్యేక స్థానాన్ని పొందింది. అల్లూరి పోరాటం బ్రిటీష్ వారిని గడగడలాడించింది. విద్యార్థి దశలోనే దోపిడీని రూపుమాపేందుకు అల్లూరి తనవంతు పోరాటం ప్రారంభించారు. 'ఎవడురా? నా భరతజాతిని కప్పమడిగిన దుష్టుడు' అంటూ బ్రిటీష్ అధికారులను ఎదిరించాడు. 1922 ఆగస్టు 22న తొలిసారిగా చింతపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారు. ఆ మరునాడే రాజవొమ్మంగి పోలీస్‌స్టేషన్‌పైనా, ఆ మరునాడు అడ్డతీగల, రంపచోడవరం పోలీస్‌స్టేషన్లపై దాడులు జరిపారు. ఈ పోరాటాన్ని అణచివేసేందుకు బ్రిటీష్ ప్రభుత్వం నిరంకుశ సైనాధికారి రూథర్ ఫర్డ్‌ను ప్రత్యేకంగా రప్పించింది. అల్లూరి జాడకోసం గిరిజనులను అనేక విధాలుగా బ్రిటీష్ సైనికులు హింసించారు. 1924 మే 12న కొయ్యూరుకు సమీపంలో అల్లూరిని బంధించి కాల్చిచంపారు.



సంపూర్ణ స్వాతంత్ర్యమే లక్ష్యంగా కమ్యూనిస్టుల పోరాటం

1921లో ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునివ్వడంతో అప్పటివరకూ సాగిన స్వాతంత్ర్య పోరాటం దిశ మారింది. సరిగ్గా అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో మహాత్మాగాంధీ శకం బలోపేతమైంది. భారతజాతిని ఒక్కతాటిపై నిలిపి, బ్రిటిష్ వాడికి వ్యతిరేకంగా నిలపడంలో గాంధీ పోషించిన పాత్ర ఎంతో ఉన్నతమైనది. ప్రతి భారతీయుడినీ స్వాతంత్ర సమరోన్ముఖుల్ని చేయడం కోసం ఆయన దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ విస్తృతంగా పర్యటించారు. తన పర్యటనలో భాగంగా ఆయన విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాలను పర్యటించారు.

బాపూజీకి బాసటగా..

1920లో దేశంలో స్వాతంత్ర్య కాంక్ష బలీయమైంది. విశాఖ జిల్లా నుంచి ఎందరో యువకులు, మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారు. అదే సమయంలో గాంధీ విశాఖ జిల్లాలో పర్యటించారు. గాంధీ ప్రసంగాలకు యువత స్ఫూర్తి పొంది పెద్దఎత్తున ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1921 మార్చి 31న విజయవాడలో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకుగానూ గాంధీ కోల్‌కత్తా నుంచి మార్చి 27న మెయిల్‌లో బయల్దేరారు. మార్గమధ్యలో అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద ఆగి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. గాంధీజీ తిరిగి 1929 ఏప్రిల్ 28న విశాఖపట్నం మరోసారి వచ్చారు. భీమునిపట్నం, అనకాపల్లి, ఏటికొప్పాక, చోడవరం, కైలాసపట్నం, నక్కపల్లి తదితర ప్రాంతాల్లో గాంధీ పర్యటించి, ఖద్దరు నిధి వసూలు చేశారు. 1933లో మరోసారి గాంధీ విశాఖపట్నం వచ్చారు. అస్పృశ్యతా నివారణోద్యమంలో భాగంగా ఆయన ఈ దఫా పర్యటించారు. ఈ సందర్భంగా పెద్దమొత్తంలో హరిజన ఫండ్ సమకూరింది. 1946లో గాంధీ మరోసారి విశాఖ జిల్లాలో పర్యటించారు. కళా వెంకటరావు, తెన్నేటి విశ్వనాథం, ముళ్లపూడి పళ్లంరాజు, కొల్లూరి వీరభద్రరావు తదితరులతో కలిసి గాంధీ రైల్వే మైదానంలోని బహిరంగ సభకు కాలినడకన వెళ్లారు. అక్కడ జరిగిన బహిరంగసభలో మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో విశాఖ జిల్లాను గాంధీజీ నాలుగుసార్లు సందర్శించారు. ఇలా పర్యటించి నప్పుడల్లా గాంధీకి విశాఖ ప్రజలు అండగా ఉన్నారు. గాంధీ స్ఫూర్తితో అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి వంటి ప్రాంతాల్లో పెద్దఎత్తున పోరాటాలు చేశారు.

ఉప్పు సత్యాగ్రహంలో అరెస్టుల పర్వం

1930 ఏప్రిల్‌లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం జిల్లాలో మూడు విడతలుగా జరిగింది. ఈ బృందాలకు మారేపల్లి రామచంద్రశాస్త్రి, మల్లెమడుగుల జగన్నాథరావు, దిగుమర్తి జానకీబాయమ్మ నాయకత్వం వహించారు. ఒక బృందం అరెస్టయితే, మరో బృందం ఉప్పు సత్యాగ్రహం నిర్వహించేంది. 1930 ఏప్రిల్ 13న సాయంత్రం 4 గంటలకు నగరంలోని టౌన్‌హాల్ ఎదుట సముద్రంలో ఉప్పు వండారు. దీనికి ఐదు వేల మంది పాల్గొన్నారు.

క్విట్ ఇండియా ఉద్యమంలోనూ కీలకంగా...

1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలోనూ విశాఖ జిల్లావాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనకాపల్లిలో కోరుకొండ బుచ్చిరాజు, కోరుకొండ సుబ్బరాజు, జిక్కినపల్లి శ్రీరామూర్తి తదితరులను బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఉద్యమానికి ప్రజలను సమీకరించడంలో కమ్యూనిస్టు నాయకులు సిఆర్ వల్లభన్, మళ్ల నర్సింహామూర్తి, పెంటకోట శ్రీరాములు కీలకపాత్ర పోషించారు.









జాతీయోద్యమంలో వీరనారీమణులు

◆ సమరశీల పోరాటాలు నడిపిన జిల్లా మహిళలు ◆ విశాఖలో జానకీబాయమ్మ పాత్ర వీరోచితం ◆ నాయకీమణులకు దిమిలి గ్రామం పుట్టినిల్లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ : భారత స్వాతంత్ర్యోద్యమంలో విశాఖ జిల్లాకు చెందిన ఎందరో మహిళలు సమరశీల పోరాటాలు నిర్వహించారు. బ్రిటీషు ముష్కర పాలనకు నిరసనగా దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన మహోద్యమంలో నిప్పుకణికలయ్యారు. వీరందరి పేర్లూ చరిత్రలో లిఖించబడక పోయినప్పటికీ స్వాతంత్ర్యోద్యమానికి వీరిచ్చిన తోడ్పాటు, మిలిటెన్సీ పోరాటాల్లో వీరు ప్రదర్శించిన తెగువ, ధైర్యసాహసాలూ... ఎంతో కీలకమైనవి. స్త్రీలు చదువుకోవడాన్ని సైతం అంగీకరించని ఆనాటి సమాజపు కట్టుబాట్లను ఛేదించి మరీ తెల్లదొరల పాలనను అంతమొందించేందుకు విశాఖ జిల్లా మహిళలు నడుం బిగించారు. పురుషులతో సమానంగా భుజంభుజం కలిపి పోరాటాలకు సిద్ధమయ్యారు. కన్నూమిన్నూ కానని బ్రిటీషు నిర్బంధం కొనసాగుతున్న రోజుల్లో గర్భిణులు సైతం ఆందోళనల్లో అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించారు. కుటుంబాలకు దూరంగా, ఒంటరిగా జైలు జీవితాన్ని అనుభవించారు. కొంతమంది జైళ్లలోనే బిడ్డలకు జన్మనిచ్చారు. ఒకపక్క కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరోవైపు దేశంకోసం జీవితాలను త్యాగం చేసేందుకు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో ఎదురైన బ్రిటీషు నిర్బంధం, ఆటంకాలు వారిలోని దేశభక్తిని ఏమాత్రం చెదరగొట్టలేకపోయాయి.

ఆంధ్ర రాష్ట్రం మొత్తమ్మీద బ్రిటీషు ప్రభుత్వ నిర్బంధానికి గురై జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళ విశాఖపట్నానికి చెందిన దిగుమర్తి జానకీబాయమ్మ కావడం మన జిల్లాకు ఎంతో గర్వకారణం. దేశస్వాతంత్ర్య పోరాటంలో భాగంగా విశాఖ జిల్లాలో నడిచిన ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన, క్విట్ ఇండియా తదితర ఉద్యమాల్లో జిల్లా మారుమూల ప్రాంతాల మహిళలు సైతం చురుకైన పాత్ర పోషించారు. కొన్ని ఉద్యమాలను మహిళలే ముందుపీఠిన ఉండి నడిపించారు. యలమంచిలి, అనకాపల్లి, విశాఖపట్నం, యలమంచిలి మండలంలోని దిమిలి, మాడుగుల తదితర ప్రాంతాల్లో మహిళా ఉద్యమాలు నడిచాయి. మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు, వరకట్న వేధింపులు వంటి గృహ, సామాజిక హింసలు పెరుగుతున్న నేటి తరుణంలో ఆనాటి మహిళా ఉద్యమ గాథలను మననం చేసుకోవడం అత్యంత ఆవశ్యకం. విశాఖపట్నంలో జన్మించిన జానకీబాయమ్మ జిల్లా జాతీయోద్యమంలో నాయకత్వ పాత్ర పోషించింది. శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహం, రౌలత్ బిల్లుకు నిరసనగా నిర్వహించిన సత్యాగ్రహం తదితర అనేక ఉద్యమాల్లో తెగువ ప్రదర్శించింది. గర్భిణిగా ఉన్న సమయంలో సైతం ఆమె ప్రత్యక్ష పోరాటాలను నడపడానికి వెరవలేదు. చివరకు గర్భిణిగా ఉండగానే బ్రిటీషు నిర్బంధానికి గురై రాయవేలూరు జైలులో శిక్ష అనుభవించింది. జైల్లోనే ఆమె ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ బిడ్డ జైల్లోనే ఏడునెలలపాటు పెరిగింది.



విద్యార్థి దశ నుంచే బ్రిటీషు వ్యతిరేక ఉద్యమం పట్ల ఆకర్షితులైన జానకీబాయమ్మ జాతీయోద్యమంలో అడుగుపెట్టింది. విశాఖ క్వీన్‌మేరీ హైస్కూల్లో చదువుతుండగా దక్షిణాఫ్రికా సత్యాగ్రహోద్యమానికి, బందరులో జాతీయ కళాశాల స్థాపనకు విరాళాలు వసూలు చేసింది. 1915లో పెళ్లిచేసుకుంది. అనంతరం జిల్లాలో ఆందోళనకు నాయకత్వం వహించింది. స్వాతంత్ర్యయోధులైన ఆమె భర్త దిగుమర్తి రామస్వామి పంతులు ఆమెకు పూర్తి సహాయ సహకారాలు అందించారు. ఈమె 1920లో కాకినాడ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యురాలిగా నియమితులయ్యారు. జిల్లాలో ఉప్పు సత్యాగ్రహ శిబిరం ఈమె నాయకత్వంలోనే నడిచింది. ఆమె విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్వహించిన ప్రచారయాత్రల్లో పాల్గొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆమె విశాఖ పురపాలక సంఘ సభ్యురాలిగా రెండుసార్లు ఎన్నికయ్యారు. యలమంచిలికి చెందిన కాలనాథభట్ల మహాలక్ష్మమ్మ శాసనోల్లంఘన, ఉప్పు సత్యాగ్రహోద్యమాల్లో చురుకైన పాత్ర పోషించింది. 1920లో చోటు చేసుకున్న ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆరునెలల కఠిన కారాగార శిక్ష అనుభవించింది. 1933లో శాసనోల్లంఘనలో ముందుపీఠిన నిలిచి మళ్లీ వెల్లూరు, కన్ననూరు జైళ్లలో శిక్ష అనుభవించింది. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని మరో మూడు మాసాలు జైలు పాలైంది. ఆమె 1967లో కన్నుమూసింది. యలమంచిలికి చెందిన మిస్సుల లక్ష్మీ నరసమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో అసమాన ధైర్యసాహసాలను ప్రదర్శించింది. గర్భిణిగా ఉన్న సమయంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని బ్రిటీషు నిర్బంధానికి గురైంది. నిండు గర్భిణి అయిన ఆమె అత్యంత కష్టతరమైన పరిస్థితుల్లో జైలు జీవితాన్ని అనుభవించింది. కన్ననూరు జైల్లో ఒక ఆడశిశువుకు జన్మనిచ్చింది. తిరిగి 1932 సెప్టెంబర్‌లో అరెస్టయి మరో నాలుగు నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్ళలో శిక్ష అనుభవించింది.

శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటీషు ప్రభుత్వం లింగమాంబకు రూ.200 జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. ఈ మొత్తాన్ని చెల్లించగలిగిన స్థోమత ఉండి కూడా బ్రిటీషు పాలకుల ఎదుట తలవంచేందుకు లింగమాంబ సిద్ధపడలేదు. ఆరు నెలల జైలు జీవితాన్ని అనుభవించింది. యలమంచిలి మండలంలోని దిమిలి గ్రామానికి చెందిన ఈమె 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని మూడు నెలలు కారాగార శిక్షను అనుభవించింది. క్విట్ఇండియా ఉద్యమంలో ముందుపీఠిన నిలిచి మరో మూడు నెలల పాటు జైలు జీవితాన్ని గడిపింది. ఇదే గ్రామానికి చెందిన సోదెమ్మ, లక్ష్మీనరసమ్మ, శ్యామసుందరమ్మ ప్రత్యక్ష పోరాటాల్లో పాల్గొన్నారు. 1940లో నిర్వహించిన వ్యక్తి సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నందుకు సోదెమ్మ మూడునెలల జైలు శిక్ష అనుభవించింది. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని లక్ష్మీనరసమ్మ వెల్లూరు జైల్లో మూడునెలల పాటు, శ్యామ సుందరమ్మ ఏడునెలల పాటు కారాగార శిక్ష అనుభవించారు. అనకాపల్లికి చెందిన దర్భా వెంకట రమణమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఈ ప్రాంత మహిళలను కదిలించింది. ఇందుకోసం నాలుగు నెలలపాటు నెల్లూరు, వెల్లూరు జైళ్లలో శిక్ష అనుభవించింది. కొడుకుల కామేశ్వరమ్మ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మూడు మాసాలపాటు వెల్లూరు జైల్లో శిక్ష అనుభవించింది. దేశాయి 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో తెల్లదొరల నిర్బంధానికి గురైంది. విశాఖపట్నం వాసి గుండుమల్ల రంగనాయకమ్మ శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని ఆరు మాసాల జైలుశిక్ష అనుభవించింది.

స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన అందరి మహిళల పేర్లూ చరిత్రకెక్కక పోయినప్పటికీ జిల్లాలో ఏజెన్సీ, మైదాన ప్రాంతాల బ్రిటీషు వ్యతిరేక పోరాటంలో స్త్రీల పాత్ర అద్వితీయమైనది. మన్నెంలో అల్లూరి సీతారామరాజు నడిపిన బ్రిటీషు వ్యతిరేక పోరాటానికి గిరిజన మహిళలు అనూహ్యమైన సహాయ సహకారాలు అందించారు. రహస్యజీవితం గడుపుతున్న ఉద్యమకారులకు ఆహారాన్ని సమకూర్చి, వారి బట్టలు ఉతకడం తదితర పనులను చేయడం ద్వారా సహకరించారు. ఎన్ని ఒత్తిడులొచ్చినా, శారీరక, మానసిక హింసలు ఎదురైనా ఉద్యమ రహస్యాలను కడుపులో పెట్టుకొని స్ఫూర్తిదాయకంగా నిలిచారు. నేడు దేశంలో అసమానతలు పెచ్చుమీరుతూ, సామాన్యుల బతుకులు ఛిద్రమవుతున్న తరుణంలో నాడు తెల్లదొరలను తరిమికొట్టిన ఉద్యమ గాథలను మననం చేసుకోవడం, ఆ స్ఫూర్తితో ఉద్యమించడం అత్యంత ఆవశ్యకం.



స్ఫూర్తి కెరటం.. విశాఖ

(మొదటి పేజీ తరువాయి..) చదువులకు స్వస్తి చెప్పి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. బ్రిటిష్ పోలీసుల చేతుల్లో వందలాది మంది లాఠీదెబ్బలు తిన్నారు. అరెస్టయ్యారు. జైలు శిక్షలు అనుభవించారు. విశాఖపట్నం, అనకాపల్లి, మాడుగుల, యలమంచిలి వంటి ప్రాంతాల నుంచి పెద్దఎత్తున అలుపెరగని పోరాటాలు నడిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్‌లో కూడా ఈ ప్రాంతం నుంచి అనేక మంది చేరారు. తెల్లవాడి దాస్య శృంఖలాల నుంచి విముక్తి కోసం సాగిన పోరాటంలో అల్లూరి సీతారామరాజు విశాఖ మన్యంలో సాగించిన పోరాటం మకుటాయమానంగా నిలుస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమంలో జిల్లాకు చెందిన కమ్యూనిస్టు నాయకులు కీలకపాత్ర పోషించారు. తెల్లవాడి పాలనపై 18వ శతాబ్దంలోనే విశాఖ జిల్లాలోని అనేకచోట్ల తిరుగుబాట్లు జరిగాయి. 1780 అక్టోబర్ 3న విశాఖ రెజిమెంటులో సిపాయిలు బ్రిటిష్ అధికారులపై తిరుగుబాటు చేశారు. 1794 జులై 9న పద్మనాభ యుద్ధం బ్రిటిష్‌వారి వైఖరిలో పెద్ద మార్పు తీసుకొచ్చింది. విశాఖపట్నాన్ని సైనిక కేంద్రంగానూ, పాలనా కేంద్రంగానూ బలోపేతం చేయాలని బ్రిటిష్‌వారు ఈ యుద్ధం తరువాత నిర్ణయం తీసుకున్నారు.

పోరాట బీజాలు..
విశాఖ వెన్నంటే..

పూర్వపు పోరాట బీజాలు విశాఖ వెన్నంటే ఉన్నాయనడానికి నేడు జిల్లాలో సాగుతోన్న అనేక ప్రజా, కమ్యూనిస్టు పోరాటాలు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్య వీరులు నింపిన ఉద్యమ స్ఫూర్తి నేటికీ ప్రతిబింబిస్తోందనడానికి ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకునే పోరాటాలే తార్కాణం. అల్లూరి సీతారామారాజు అమాయక గిరిజనులను కదిలించి సాగించిన పోరాటం నేటికీ గిరిజనుల్లో స్ఫూర్తి నింపుతూ ఉంది. బాక్సైట్, ఇతర ఖనిజ నిక్షేపాలు తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసీలు ఉమ్మడి విశాఖలో గళమెత్తుతూనే ఉన్నారు. తమ జీవితాను ఛిద్రం చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితోనే నేడు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం సాగుతోంది. కేంద్రంలోని కాషాయ బిజెపి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కబంధ హస్తాల్లోకి తీసుకెళ్లాలనే ప్రయత్నాలను, బిజెపి మతోన్మాద, ప్రైవేటీకరణ విధానాలను విశాఖలో సిపిఎం, సిఐటియు నాయకత్వంలో కమ్యూనిస్టు ఉద్యమం, కార్మికోద్యమాలు తిప్పికొడుతూ వస్తున్నాయి.



సిపాయిల తొలి తిరుగుబాటు ఇక్కడే..

ప్రజాశక్తి - విశాఖపట్నం

స్వాతంత్ర్యోద్యమంలో సిపాయిల తిరుగుబాటుకు ఎంత ప్రాధాన్యత ఉందో చెప్పనక్కర్లేదు. సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగిందని ఎవర్నయినా ప్రశ్నిస్తే 1857లోనని టక్కున జవాబిస్తారు. అయితే, దీనికి 77 ఏళ్ల కిందటే విశాఖపట్నంలో సిపాయిలు అధికారులపై తిరుగుబాటు చేశారు. 1780 అక్టోబర్ 3న ఈ సంఘటన జరిగింది.

అప్పటి కర్నాటకలోని మైసూరు ప్రాంతాన్ని హైదరాలీ పాలించేవాడు. బ్రిటిష్ అధికారులకు అతడు సింహస్వప్నమే అయ్యాడు. అతడి ధాటికి తాళలేని బ్రిటిష్ ప్రభుత్వం భారీ సైనిక బలగాలతో అణచి వేయాలని నిర్ణయించింది. అప్పట్లో మద్రాసులో ఉన్న సైనికబలం ఇందుకు సరిపోదని భావించిన ప్రభుత్వం విశాఖ నుంచి సైనికుల్ని ఇందుకోసం తరలించాలని భావించింది. అప్పట్లో విశాఖ, శ్రీకాకుళం ప్రాంతాల్లో సైనికులు భారీ సంఖ్యలో ఉండేవారు. ఆ కాలంలో విశాఖ నుంచి మద్రాసు వెళ్లాలంటే నౌకాయానం తప్ప మరో మార్గం ఉండేది కాదు. అప్పట్లో హిందూ సంప్రదాయం ప్రకారం సముద్రంమీద ప్రయాణం తప్పుగా భావించేవారు. మద్రాసు వెళ్లి పోరాడాల్సింది కూడా భారతీయుడిపైనే. ఈ కారణాలవల్ల విశాఖ నుంచి సైనికులు మద్రాసు వెళ్లడానికి విముఖత చూపారు. అయితే, అధికారుల ఆజ్ఞల మేరకు ప్రయాణానికి సన్నాహాలు జరిగాయి. సిపాయిలు రిసాట్ అనే అధికారి సారధ్యంలో 'సారిటన్ ఫ్రిగేడ్' అనే నౌకలో మద్రాసు చేరుకోవాల్సి ఉంది. ఈ సందర్భంగా ఒక అధికారి సిపాయిలకు విందు ఏర్పాటు చేశారు. సిపాయిలంతా నౌక ఎక్కడానికి ముందు కవాతు చేయాల్సి ఉంటుంది. దీనిని తిలకించడానికి బ్రిటిష్ అధికారులు వచ్చారు. 1780 అక్టోబర్ 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సిపాయిలు నౌక ఎక్కాల్సివుంది. అంతే... సైనికుల్లో గూడుకట్టుకుని ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బద్దలైంది. నౌక ఎక్కడానికి సైనికులు నిరాకరించారు. దీంతో, అధికారులు తుపాకులు గురిపెట్టి బలవంతంగా నౌక ఎక్కించేందుకు ప్రయత్నించారు. దీంతో, సైనికులకు, అధికారులకు మధ్య హోరాహోరీ పోరు జరిగింది. ఈ పోరాటంలో లెఫ్టినెంట్ క్రిస్ట్స్, కింగ్స్ ఫోర్డ్ విన్నర్, రాబర్ట్ రూథర్‌ఫర్డ్ (సిపాయిలకు జీతాలిచ్చే అధికారి), ఒక క్యాడెట్ అక్కడికక్కడే మరణించారు. ఛార్లెస్ మాక్స్‌టోన్ అనే అధికారి తలకు బలమైన గాయాలయ్యాయి. మరో అధికారి రాబర్ట్‌కు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. సైనికుల ఆగ్రహంతో భయాందోళనలకు గురైన నౌక కెప్టెన్ లేక్ కొంతమంది సిపాయిల సహాయంతో పారిపోయి దాక్కున్నాడు. మిగతా యూరోపియన్లు కూడా పలాయనం చిత్తగించారు. విశాఖ గవర్నర్ కాసనేజర్‌ను సైనికులు బంధించారు. ఈ సందర్భంగా ఒక ఫ్రెంచి గూఢచారిని సిపాయిలు విడుదల చేశారు. ఈ సైనిక తిరుగుబాటుకు సుబేదార్ షేక్ మహమ్మద్ నాయకత్వం వహించాడు. ఈ తిరుగుబాటు సందర్భంగా 24 గంటలపాటు విశాఖలో స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడింది. కాసనేజర్‌ను చంపేస్తామంటూ బెదిరించారు. ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించి, ఈస్టిండియా కంపెనీకి చిల్లు పెడుతున్న కాసనేజర్ ఈ దాడితో హడలిపోయాడు. బ్రిటిష్ ఉద్యోగుల నుంచి రూ.21,999, ఖజానా నుంచి రూ.15 వేలు సైనికులు స్వాధీనం చేసుకున్నారు. మర్నాడు అంటే అక్టోబర్ 4న కాసనేజర్‌చేత రెండు ఒప్పందాలపై సైనికులు సంతకాలు చేయించుకున్నారు. డిస్మిస్‌కు గురైన పర్లాకిమిడి జమీన్‌దారు గజపతి నారాయణ్‌దేవ్‌ను తిరిగి జమీన్‌దారుగా గుర్తించాలని, మద్రాసు పంపిన సిపాయిలను వెనక్కు రప్పించాలని ఒప్పందం చేసుకున్నారు. ఈ తిరుగుబాటు ఫలితంగా సైనికుల సౌకర్యాలు మెరుగుపడ్డాయి. వారి జీతభత్యాలు పెంచారు.

ఈ తిరుగుబాటుకు ప్రతీకార చర్యగా కొన్ని నెలల తరువాత సుబేదార్ షేక్ మహమ్మద్‌ను, తిరుగుబాటులో ముఖ్య పాత్ర పోషించిన మరికొంతమందిని బ్రిటిష్ కసాయి మూకలు ఫిరంగులకు కట్టి కాల్చి చంపాయి. ఈ తిరుగుబాటులో మృతి చెందిన బ్రిటిష్ అధికారుల సమాధులు పాత పోస్టాఫీసువద్ద ఉన్న డచ్ సమాధుల్లో ఉన్నాయి. అయితే, వీటి గురించి పట్టించుకున్నవారే లేరు. ఇంకా ఈ సంఘటనకు సంబంధించిన స్మృతులు చెన్నైలోని ఫోర్ట్ సెయింట్‌జార్జ్ మ్యూజియంలో ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి.



TRIBE బ్రాండ్ సహజ ఉత్పత్తులకు స్వాగతం...

- ట్రైబల్ ఉమెన్ మల్టీపర్పస్ మ్యుచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ద్వారా TRIBE బ్రాండ్ సహజమైన ఆరోగ్యకరమైన ఉత్పత్తులు ప్యాకింగ్ మరియు మార్కెటింగ్ చేయబడుతున్నాయి. వినియోగదారులకు తక్కువ ధరలో ఆరోగ్యకరమైన సహజ ఉత్పత్తులను అందిస్తూ, గిరిజన కుటుంబాల సామాజిక, ఆర్థిక సాధికారత లక్ష్యంగా మా సంస్థ పని చేస్తోంది.
- TRIBE బ్రాండ్ పసుపు పొడి ఇప్పడు మార్కెట్‌లో అందుబాటులో ఉంది.

ఉత్పత్తి హైలైట్స్ :

- 'అసాధారమైన నాణ్యత' ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల గిరిజన రైతులు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించి అధిక నాణ్యత గల పసుపును జాగ్రత్తగా పండిస్తున్నారు.
- "సాంప్రదాయ జ్ఞానం" పసుపు పొడికి శతాబ్దాలుగా ఆయుర్వేదం మరియు సాంప్రదాయ భారతీయ వైద్యంలో విశేష గుర్తింపు ఉంది. ఔషధ, ఆహార మరియు అధ్యాత్మిక సందర్భాల్లో విస్తృతంగా ఉపయోగించబడుతుంది.
- "అధిక కర్కుమిన్‌శాతం" ఏజెన్సీ పసుపు సహజంగా అధిక కర్కుమిన్ శాతం కలిగి ఉంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంది. మరియు మీ రోగ నిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది.
- "స్వచ్ఛమైన మరియు సహజమైనది" TRIBE బ్రాండ్ పసుపు పొడిలో ఎటువంటి కృత్రిమ రంగులు లేదా రసాయనాలు ఉండవు. సహజ వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పసుపును మాత్రమే ఉపయోగిస్తున్నాము.
- "ఆరోగ్య ప్రయోజనాలు" పసుపు అర్థరైటిస్, జీర్ణ సమస్యలు, శ్వాసకోశ ఇన్ఫెక్షన్లు, అలెర్జీలు మరియు కాలేయ సమస్యలు వంటి అనేక ఆరోగ్య సమస్యలకు సహజ చికిత్సగా ఉపయోగపడుతుంది.
- TRIBE బ్రాండ్ పసుపు పొడి 100 గ్రాముల నుండి వివిధ ప్యాకింగ్ సైజుల్లో లభిస్తుంది"
- " ప్రోత్సహించండి & సంప్రదించండి"
- " TRIBE బ్రాండ్ ఉత్పత్తులను కొనుగోలు చేసి, గిరిజన రైతులు సాధికారతకు మీ వంతు సహకారం అందించండి"
- కస్టమర్ కేర్ : 0891-2713871
- E-mail: tribalwomencoopsocietyvsp@gmail.com
- "TRIBE బ్రాండ్ పసుపు పొడి వినియోగం-వినియోగదారులకు ఆరోగ్యం.. గిరిజనులకు సాధికారత"

Facilitators : STEMS WELFARE ASSOCIATION
D.No.49-51-7/5, Santipuram, Behind Karnataka Bank, Sankaramatham Road, Visakhapatnam-16

